ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

ఆదివారం 28 జనవరి 2024 | 3



రేపు రాజమహేంద్రవరంలో రా కదలిరా



- చంద్రబాబు నాయుడు హాజరు
- కాతేరులో భారీ బహిరంగ సభ
- జిల్లా వ్యాప్తంగా జనం రాక
- 23 ఎకరాల్లో వేదిక ఏర్పాటు

5



విలేకరులతో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

నేడు యూటీఎఫ్ ఓట్ ఫర్ ఓపీఎస్

రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్ వెల్లడి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 27 : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని ఎవరైతే పునరుద్ధరిస్తారో వారికే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీపీఎస్ రద్దుతో పాటు పాత పెన్షన్ సాధనకు ఆదివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓట్ ఫర్ ఓపీఎస్ సభను నిర్వహిస్తున్నామని వెల్లడించారు.ఈ సభకు అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించామన్నారు.గత ఎన్నికల ముందు జగన్మోహనరెడ్డి సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తామని ప్రకటించి ఉద్యోగులను మోసం చేశారన్నారు. జీపీఎస్‌తో ఎవరికీ ప్రయోజనం లేద న్నారు. సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు అరుణకుమారి, లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జయకర్, షరీఫ్ పాల్గొన్నారు.

పరిశ్రమలకు రూ.29.88 లక్షల రాయితీలు

10వ పారిశ్రామికాభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పారిశ్రామిక రాయితీలకు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి సుమారు రూ.29.88 లక్షల అందజేసినట్టు కలెక్టర్ డా.కె.మాధవీలత తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం జరిగిన 10వ జిల్లా స్థాయి పారిశ్రామిక అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటి వరకూ జిల్లాలో 6748 సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల కింద రూ.1109 కోట్లతో 25,222 మందికి ఉపాధి కల్పించినట్టు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి బి. వేంకటేశ్వరరావు తెలిపారు.116 అనుమతుల ప్రగతిని సమీక్షించామన్నారు. సమావేశంలో ఏపీఐఐసి జోనల్ మేనేజర్ డీవీఎంఎస్ జ్యోత్స్న, ఏపీపీసీబీ ఈఈ సందీప్‌రెడ్డి, స్టేట్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ కె.కేదారేశ్వరరావు, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జి.స్వాతి పాల్గొన్నారు.



సెంట్రల్ జైలులో జరిగిన రిట్రీట్‌లో మాట్లాడుతున్న డీఐజీ రవికిరణ్

ఘనంగా జైళ్లశాఖ రిట్రీట్

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జైళ్లశాఖ కోస్తాంధ్ర ప్రాంత రిట్రీట్-2024ని రాజమహేంద్రవరం కేంద్ర కారాగార ప్రాంగణంలో డీఐజీ ఎంఆర్ రవికిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఏడాది శాఖలోని పరిణామాలు, సిబ్బంది సంక్షేమం, ఈ ఏడాదిలో చేయాల్సిన కార్యాచరణపై సమీక్షించారు. తూర్పుగోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన జైళ్ల సిబ్బంది పాల్గొన్నారు. లైఫ్ సేవింగ్ స్కిల్స్‌పై డాక్టర్ ఆదిత్య, అగ్నిప్రమాదాల నివారణపై ఫైర్ సిబ్బంది, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, డీఎస్‌లు రాజ్‌కుమార్, బి.రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో తండ్రికి పిల్లలను అప్పగిస్తున్న జీఆర్పీ పోలీసులు

తల్లిదండ్రుల చెంతకు అక్కాచెల్లెళ్లు

తప్పిపోయిన బాలికలను పట్టుకుని అప్పగించిన జీఆర్పీ

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రివేళ రాజమహేంద్రవరం ప్రభుత్వ రైల్వే పోలీసులు(జీఆర్పీ) వేగంగా స్పందించడంతో తప్పిపోయిన ఇద్దరు బాలికలు తల్లిదండ్రుల చెంతకు చేరారు. 26న అర్ధరాత్రి సమయంలో విశాఖ న్యూ పోర్ట్ పోలీసులు ఇక్కడి జీఆర్పీ సీఐ విజయ్ శంకర్‌కి ఫోన్ చేశారు. తమ స్టేషను పరిధిలో 15 ఏళ్ల మనీషాకుమారి, 14 ఏళ్ల కిరణ్ కుమారి అనే అక్కాచెల్లెళ్ల ఆచూకీ తెలియడం లేదని సమాచారం ఇచ్చారు. వాట్సప్‌లో బాలికల ఫొటోలను పంపించారు. విజయ్ శంకర్ రాత్రి గస్తీలో భాగంగా ప్లాట్‌ఫాంపై తనిఖీలు చేస్తూ బాలికల విషయాన్ని డ్యూటీలో ఉన్న ఆర్‌పీఎస్‌ఐ శ్రీహరిబాబు, హెచ్‌సీ సత్యనారాయణ, పీసీలు భాస్కర్, రాంబాబుకు చెప్పి గమనించాలని ఆదేశించారు. వాళ్లు రైళ్లలో పరిశీలిస్తుండగా ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో ఆ బాలికలు తారసపడ్డారు. వారిని పట్టుకుని స్టేషన్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు శనివారం ఉదయం బాలికల తల్లిదండ్రులు వచ్చి తీసుకెళ్లారు.విధుల్లో అప్రమత్తత చూపిన సిబ్బందిని డీఎస్‌ఆర్‌పీ బీవీఎస్ నాగేశ్వరరావు అభినందించారు.



ముక్క..ముప్పు!

చూసికొనకపోతే అనారోగ్యమే సుమా!

ఈ రోజు ఆదివారం.. తెలవారగానే చేతిలో సంచితో మాంసాహార దుకాణాల వైపు కాళ్లు వడివడిగా అడుగులు పడతాయి..జిహ్వాచాపల్యం జివ్వున లాగుతోంది.. మిగతా రోజుల్లో ఎలా ఉన్నా ఆదివారం మాంచి మసాలా దట్టించి ఏ మేక తలకాయ ఇగురో.. చేపల పులుసో.. పీతల వేపుడో చేసేసుకుని ఎంజాయ్ చేయాలనుకుంటున్నారా? సరే.. కానిచ్చేయండి. కానీ ఒక్కసారి కొనేవాటి నాణ్యత, తాజాదనాన్ని చూసుకోండి. తెలియకపోతే తెలిసిన వాళ్ల సలహా తీసుకోండి. లేకపోతే ఆరోగ్యానికి ఎసరు పెట్టుకున్నట్టే సుమా!. పెద్ద మార్కెట్లకు వెళ్లినప్పుడు మరీ జాగ్రత్తండోయ్! మన ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన శాఖలు ఒకరిపై నెపం నెట్టుకునే జపం వదలడం లేదు మరి! చేపల మొప్పలకు రంగు, కోడి రక్తం పూసేసి అమ్మేసే స్థాయికి ఆహార భద్రత దిగజారి పోయింది. ప్రజారోగ్యం దృష్ట్యా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రజారోగ్యం అంటే యంత్రాంగానికి చులకన అయిపోయినట్లు కనిపిస్తోంది. అబ్బే.. మాది కాందటే మాది కాదంటూ ఒకరిపై ఒకరు నెపం నెట్టేసుకొని చివరికి ప్రజల ప్రజారోగ్యాన్ని పైవాడి దయకు వదిలేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా మాంసాహార మార్కెట్లు రోగాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. పట్టించుకునేవాళ్లు కనుచూపు మేరలో కనబడకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తు న్నారు. తాజా అనే మాటకు ఎప్పుడో స్వస్తి పలికేశారు. మాంసాహారంపై కాస్త అవగాహన ఉంటే పర్లేదు గానీ లేకపోతే కుళ్లిన వాటిని కొనుక్కొని ఇంటికి తీసుకెళ్లి పడేయాల్సిందే. ఒక్కోసారి కూర వండిన తర్వాత ఉసూరు మంటున్నారు.ఒకవైపు ధరలు,కొలతలపై ఎలాంటి నియంత్రణ లేకపోగా వందలాది రూపాయలు వెచ్చించి కొన్నా మంచి సరుకు దొరకడం అదృష్టంగా మారిపోయింది. ఆదివారం అయితే డబ్బులు పెట్టి మరీ రోగాలను కొని తెచ్చుకున్నట్లుగా దుస్థితి దాపురించింది.పాలకులకు ప్రజల ఆరోగ్యం అంటే ఎంత చులకనంటే.. జిల్లాకు ఒకరే ఆహార భద్రతా అధికారి ఉన్నారు.ఆయనకు తనిఖీలకు వెళ్లడానికి ఎలాంటి సదుపాయాలూ లేవు.ప్రజలకు ఎవరికి ఫిర్యాదు చేయాలో ఎవరూ అవగాహన లేదు.

ఆహార నియంత్రణ ఏదీ?

మునిసిపల్/పంచాయతీ కమేళాలో మేకలు, గొర్రెలను కోసిన తర్వాత ప్రజారోగ్యానికి ఇబ్బంది లేదని వెటర్నరీ వైద్యుడు ధ్రువీకరించిన తర్వాతే విక్రయాలు జరపాలి. కానీ వందలో పదిశాతం కూడా ఆ విధానం కానరాదు. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో వ్యాపారులు ఇష్టారాజ్యం చేస్తున్నారు.ఇక జిల్లా ఆహార భద్రత శాఖలో ఒకే అధికారి ఉన్నారు. ఆయనే జిల్లా అంతా తిరుగుతూ తనిఖీలు చేస్తుండాలి.దీంతో ఆహార భద్రతను అభద్రత వెంటాడుతోంది.ఆయనకు ఎలాంటి వాహనం కూడా ప్రభుత్వం తరఫు నుంచి లేకపోవడం గమనార్హం. ఇక వెటర్నరీ,మునిసిపాలిటీ, విజిలెన్స్, తూని కలు కొలతల అధికారులు మార్కెట్లవైపు ఎందుకనో కన్నెత్తి చూడడం లేదు.మార్కెట్ నుంచి బయటకు వచ్చేంత వరకూ ముక్కు మూసుకోవాల్సిందే.ఇంత దారుణంగా పరి స్థితులున్నా కనీసం ఎవరికి ఫిర్యాదు చేయాలో కూడా అధికారుల నెంబర్లతో కూడిన బోర్డులు ఎక్కడా కనబడవు.



నిల్వ మాంసం

హైదరాబాద్ టు జాంపేట

జిల్లాలోకి ముఖ్యంగా జాంపేట తదితర మాంసాహార మార్కెట్లకు హైదరాబాద్ నుంచి శుక్రవారం రాత్రి సమయంలో నిల్వ ఉన్న మేక, గొర్రె తలకాయలు, కాళ్లు, లివర్ వంటి శాల్తీలు ఐస్‌బాక్సుల్లో పెట్టి వ్యానులో తీసుకొచ్చి దిగుమతి చేస్తున్నారని సమాచారం. శనివారం పెద్దగా బేరాలు ఉండవు కాబట్టి వాటిని అలాగే ఐస్‌బాక్సుల్లో నిల్వ ఉంచి ఆదివారం సందట్లో సడేమియాలో అమ్మేస్తున్నారు. కాస్త తక్కువ ధరకు రావడంతో కొనుగోలుదారులు ఎగబడుతున్నారు.దీంతో ఒక్కోసారి ప్రజారోగ్యంపైనా ప్రభావం పడుతోంది.

ఆదివారం అయితే..

ఆదివారం మాంసాహార ప్రియులు చేపలు, రొయ్యలు, పీతలు, మేక, తలకాయమాంసం, కోడి మాంసం తదితర మాంసాహారం కొనుగోలులో బిజీగా ఉంటారు. మార్కెట్లలోని వ్యాపారులు ఇష్టానుసారం నిల్వ ఉంచిన సరుకును యథేచ్ఛగా విక్రయించేస్తున్నారు. ఉదాహరణకు జిల్లాలోనే పెద్ద మాంసాహార మార్కెట్‌గా చెప్పుకొనే రాజమహేంద్రవరం జాంపేట మార్కెట్‌లో పరిస్థితి దారుణంగా ఉంటుంది. బాగా నిల్వ ఉండి, వాసన వస్తున్నా.. ఈగలు విపరీతంగా ముసురుకుంటున్నా అమ్మకాలు సాగించేస్తారు. తెలంగాణలోని హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి మేక తలకాయలు, కాళ్లు, శాల్తీలు వంటివి ఐసు బాక్సుల్లో పెట్టి సర ఫరా చేస్తున్నారు.వాటిలో పాడైపోయినవి ఉంటాయి. వీటన్నింటినీ కాస్త తక్కువ ధరకు అమ్మేస్తుం టా రు. అందుకే జాంపేట మార్కెట్‌లో చాలా తక్కువ ధర ఉంటుందని పట్టణవాసులు చెబుతుంటారు. కలిసి వస్తుందని ఆశ పడి కొనుగోలు చేస్తున్న కొంత మంది వినియోగదారులు మోసపోతున్నారు. అలా కొనుగోలు చేసిన చాలా మంది రోగాల బారిన పడుతున్నారు. మార్కెట్లలోనే జంతువులను వధించి అమ్మేస్తున్నారు. చేపలు, రొయ్యలు,పీతలు పాడైపోయినవి, కొద్దిసేపట్లో పాడవుతాయనుకున్న వాటినీ అంటగట్టేస్తున్నారు. రోగాలను సరఫరా చేయడానికి ఈగలు ముసురుకుంటున్నాయి.ఒక వైపు సరుకు నాణ్యత అలా ఉంటే.. తూనిక లోనూ మోసాలతో వినియోగదారుల జేబుకు పెద్ద చిల్లే పడుతోంది. తూనికలు కొలతల సిబ్బంది కొరత ఉండడం ప్రజలకు శాపంగా మారింది. ఎలక్ట్రానిక్ కాటాలు ట్యాంపరింగ్ చేసేస్తున్నారు. తూకం రాళ్లు ఎప్పటివో తూనికలు కొలతల శాఖకే తెలియాలి. ఇక జాంపేట చికెన్ మార్కెట్ జిల్లాలోనే పెద్దది. ఇక్కడ శుభ్రత ఉండకపోగా ఎవరి ధరలు వారివే. కనీసం తనిఖీలు లేక ప్రజారోగ్యంతో వ్యాపారులు ఆడుకుంటున్నారు.

- మార్కెట్లకు చేరుతున్న నిల్వ మాంసం
- యథేచ్ఛగా సాగుతున్న విక్రయాలు
- తెలంగాణ నుంచి రాక
- ఆదివారమే భారీగా అమ్మకాలు
- ఎగబడుతున్న కొనుగోలుదారులు
- కన్నెత్తి చూడని అధికారులు
- నిద్దరోతున్న ఫుడ్ సేఫ్టీ
- ఆసుపత్రి బెడ్‌పై ప్రజారోగ్యం

అసలైతే ఇలా చేయాలి

జంతువులను ముందు రోజున వైద్యుడి ముందు (యాంటే మార్టమ్) ప్రవేశపెట్టాలి. సాయంత్రం 5 గంటల నుంచి నీరు, ఆహారం ఇవ్వకుండా ఉపవాసం ఉంచాలి. ఆయన ధ్రువీకరించిన వాటినే తరువాత రోజున వధించాలి. కోసిన తర్వాత మాంసం పరీక్షించి మళ్లీ ధ్రువీకరిస్తారు.జంతువుల బాగాల్లో ఇన్‌ఫెక్షన్/కంతుల వంటివి ఉంటే వాటిని తొలగిస్తారు. మాంసాన్ని కడిగి, కట్ చేసినప్పుడు మనుషుల స్వేద గ్రంథుల ద్వారా కూడా కొన్ని వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. నిల్వ మాంసం ఉంటే బద్దెపురుగులు, క్షయ, హైడాటిడో సిస్, అంత్రాక్స్ వంటి రోగాల బారినా పడే ప్రమాదం ఉంది.

ఎవరికి వారు జాగ్రత్త పడాల్సిందే..

వ్యవస్థలు నిద్రాణస్థితిలో ఉన్నప్పుడు ఎవరి జాగ్రత్త వారు తీసుకోవడం తప్పదు. అందువల్ల కొనుగోలు చేసేప్పుడు కాస్త జాగ్రత్తలు తీసుకుంటే కొంత వరకూ అనారోగ్యం నుంచి తప్పించుకోవచ్చు.మాంసాహారం దుర్వాసన వస్తే వండడానికి పనిచేయదని తెలుసుకోవాలి. అలాంటి వాటిని తినడం ప్రాణాంతకం. సముద్రం ఉత్పత్తులు సాధారణంగా నిల్వ చేసినవే ఉంటాయి. కానీ ఎక్కువ రోజులు నిల్వ ఉన్నవి తాజాగా ఉండవు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే కొనకపోవడమే మంచిది.

అధికారుల మొద్దు నిద్ర...

జిల్లాలో రాజమహేంద్రవరం కార్పొరేషన్, నిడదవోలు, కొవ్వూరు మునిసిపాలిటీలు ఉన్నాయి. జంతువుల వధ, మాంసాహారం తనిఖీల బాధ్యత ప్రధానంగా స్థానిక సంస్థలపై ఉంటుంది.కానీ అవి పట్టించుకున్నట్లు కానరావడం లేదు. సుమారు ఐదు లక్షల మంది జనాభా పరిధి ఉన్న రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్‌లో ఒక్క మీట్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ కూడా లేరు. మార్కెట్లను తనిఖీలు చేస్తున్నారా? అంటే అదీ అనుమానమే.రాజమహేంద్రవరం కబేళాలో ఆదివారమైతే సుమారు 900 వరకూ.. జిల్లాలో అయితే దాదాపు 2వేల వరకూ మేకలు, గొర్రెలు తదితర జంతువులను వధిస్తారు. మునిసిపల్ కార్పొరేషన్ అధికారి లేకపోవడంతో పశుసంవర్ధక శాఖ నుంచి డాక్టర్ స్లాటర్ హౌస్‌కి వెళ్తున్నారు.

ఇలా చెక్ చేసుకోండి...

- **చేపలు :** సాధారణంగా చెరువు, సముద్రం చేపలు విక్రయాలు ఎక్కువగా చేస్తుంటారు. గోదావరి చేపలు పెద్దవి దొరకడం చాలా అరుదు. జెల్లలు, వాలుగులు, ఇసుక దొందులు, పరిగలు వంటి గోదావరి ఉత్పత్తులు మాత్రమే లభ్యమవుతున్నాయి. మోసు, బొచ్చె, రాగండి వంటి చెరువు రకాలు ఎక్కువగా అమ్ముతుంటారు. జాంపేట మార్కెట్లో మొప్పలకు కోడి రక్తం పూసేసి మరీ మోసం చేస్తుంటారు. అందువల్ల చేపలను జాగ్రత్తగా చూసుకొని కొనాలి.చేపలు మెత్తగా ఉండకూడదు. మొప్పలు ఎర్రగా ఉండాలి. కళ్లు తెల్లబారి ఉండకూడదు. ముఖ్యంగా దుర్వాసన రాకూడదు. చిన్న చేపలు త్వరగా పాడవుతుంటాయి.కొరమేను బతికి ఉన్నదే కొనాలి.
- **రొయ్యలు :** మెత్తగా ఉండకూడదు. తలలు వాటికవే ఊడిపోతుంటే నిల్వ సరుకని అర్థం. రొయ్య పైపొట్టు మెత్తగా ఉండకూడదు. చెరువు రొయ్యల్లో కొన్ని రకాల్లో పైభాగంలో చిన్న నరంలా నల్లగా కనబడుతుంది. దానిని తీసేయాలి.రొయ్య వ్యర్థాలు ఆ నరంలో ఉంటాయి. గోదావరి రొయ్యలంటూ చెరువు రొయ్యలు అమ్ముతుంటారు. జిల్లాలో అక్కడక్కడా వ్యాన్‌లు పెట్టి నిల్వ ఉన్న రొయ్యలనే కిలో రూ.100 రూ.150లకు విక్రయిస్తుంటారు.
- **పీతలు :** పీతలు బరువుగా ఉండాలి. నీరుగారిపోయినట్లు తేలిగ్గా ఉంటే పాడవడానికి దగ్గరపడిందని అర్థం చేసుకోవాలి. పీతలు బాగు చేయించిన తర్వాత ఎక్కువ సేపు బయట ఉంచకూడదు. ఫ్రిజ్‌లో పెట్టుకో వాలి. పీతల కాళ్లు, డెక్కలు సులభంగా విరిగిపోతే కాస్త నిల్వ సరుకని తెలుసుకోవాలి.
- **తలకాయ మాంసం :** తలకాయ మాంసంలో రెండు రకాలు.. మేక, గొర్రె తలకాయలను అమ్ముతుంటారు. తాజాగా లేని తలకాయలు, కాళ్లు తక్కువ ధరకు వచ్చేస్తున్నాయని అస్సలు కొనరాదు. నిల్వ చేసినవి, ఐస్‌లో పెట్టినవి ఉంటాయి. జాగ్రత్తగా చూసుకోవాలి. తలకాయ పైచర్మం అక్కడక్కడా ఊడిపోయి ఉంటే నిల్వ చేసినదని అర్థం చేసుకోవాలి. ఇక మేక మాంసం అయితే గొర్రెది అమ్ముతారు. ఎందుకంటే గొర్రె మాంసం కాస్త తక్కువ ధర ఉంటుంది. మేక మాంసం అమ్మకాలు తక్కువగా ఉంటాయి. దీంతో చాలా వరకూ నిల్వ మాంసమే విక్రయిస్తారు. అయినా ఎవరూ పట్టించుకోరు.
- **చికెన్ :** ప్రస్తుతం చికెన్ అమ్మకాలు ఎక్కువగా ఉంటున్నాయి.. బ్రాయిలర్ కోళ్లు ప్రతి రోజూ ఒకటో రెండో చచ్చిపోతూనే ఉంటాయి. ఫారంలో అయితే వీటి సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. ఆయా కోళ్లను సేకరించి విక్రయించేవారు ఉన్నారు. అసలు బ్రాయిలర్ చికెన్ తినకూడదనేది పెద్దల మాట.. అయినా తినేస్తున్నాం.. బతికిన కోడి చికెన్ తింటే బెటర్..

నిల్వ మాంసం తినకూడదు..



నిల్వ మాంసాహారాన్ని తినకూడదు. మాంసం తనిఖీ చేయించారా లేదా అనేది ప్రశ్నించి.. అధికారులు వేసే సీలును గమనించాలి. గర్భంతో ఉన్నా, ప్రత్యుత్పత్తికి ఉపయోగపడే, జ్వరంతో బాధపడే, చనిపోయిన పశువులను వధించి విక్రయించరాదు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమిత వ్యాధులు(జూనోటిక్ డిసీజెస్) రాకుండా నివారించవచ్చు. **- డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవింద్, జిల్లా పశుసంవర్ధక అధికారి**

మార్కెట్లను తనిఖీ చేస్తాం



మాంసాహార మార్కెట్లను ముఖ్యంగా వెటర్నరీ వాళ్లు పరిశీలించాలి. కానీ మేం కూడా చూస్తాం. ఫిర్యాదులు వస్తే తనిఖీలు చేస్తాం. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే జరిమానాలు విధించడంతో పాటు కేసులు పెడతాం. **- వి.రుక్కయ్య, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి**



చూడండి సార్ : పశువుల కొమ్ములు, కాళ్లు, ఎముకలతో నిండి ఉన్న పోలవరం కాల్వగట్టు



ఏర్పాటు చేసుకున్న అనధికార కబేళా

'బలి' పశువులు!

దేవరపల్లి అనధికార కబేళాలో మూగజీవాల కోత

దేవరపల్లి, జనవరి 27 : అసలు అధికారులు ఉన్నారో లేదో తెలియడం లేదు.. తమ చెంతనే మూగజీవాలను బలి తీసుకుంటున్నా కనీసం ప్రశ్నించడం లేదు.. పట్టుకోవడంలేదు.. కంపుకొడుతున్నా ఏమిటా అది అని అటు వైపు కనీసం కన్నెత్తి చూడడం లేదు.. దీంతో మూగజీవాలను యథేచ్ఛగా బలి తీసుకుంటున్నారు.దేవరపల్లి గ్రామం శివారు పోలవరం కుడి కాల్వ సమీపంలో మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయం, డిగ్రీ కళాశాల ఉన్నాయి. పోలవరం కాల్వ వద్ద చిట్టి అడవిగా ఏర్పడడంతో ఇక్కడ కొందరూ జంతువధ చేయడానికి స్థావరం ఏర్పాటు చేసుకున్నారు.జిల్లాలో ఎక్కడెక్కడి నుంచో పశువులను తీసుకొచ్చి అర్ధరాత్రులు పశువధ చేసి వ్యర్థాలను, ఎములకను ఎన్నో ఏళ్ళుగా ఇక్కడ పడేస్తున్నారు. దీంతో ఎముకల వ్యర్థాలు గుట్టలుగా ఏర్పడి వీటి నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో చుట్టు పక్కల కిలోమీటర్ల పొడవునా దుర్గంధం వ్యాపించి పల్లంట్ల, ఏలూరు రహదారి గుండా వెళ్ళే ప్రజల ముక్కుపుటాలను తాకుతోంది. అయినా స్థానిక అధికారుల్లో మాత్రం కనీస కదలిక లేదు..దేవరపల్లి వాసులు మాత్రం నిత్యం దుర్వాసనతో ముక్కుతిప్పలు పడుతున్నారు. ఈ సమస్యపై ఎన్నో సార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మండల పరిషత్ కార్యాలయాల చెంతనే ఉన్నా కన్నెత్తి చూడని అధికారులు

ఉండలేకపోతున్నాం..



దేవరపల్లి గ్రామంలో ఉండలేకపోతున్నాం. పశువుల వ్యర్థాల దుర్గంధంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. పశువుల వ్యర్థాలను తొలగించి పశువధ చేయకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కోరాం.. ఎన్నోసార్లు పంచాయతీ, రెవిన్యూ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. **- డాక్టర్ కాశీవిశ్వనాథం, దేవరపల్లి**

నేడు రాజమండ్రిలో ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఆదివారం చెరుకూరి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు.స్థానిక చెరుకూరి కల్యాణ మండపంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ఉదయం 11గంటల నుంచి నూతన రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక ప్రక్రియ ఆరంభమవుతుందన్నారు. ఒక్కో నామినేషన్ వస్తే కార్యకవర్గ ఎన్నిక పూర్తవుతుందని,ఎక్కువ నామినేషన్లు వస్తే వచ్చేనెల 14న విజయవాడలోని ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో పోలింగ్ నిర్వహిస్తా మన్నారు. సభకు సుమారు 2500 మంది ప్రతినిధులు హాజర వుతారన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కంచర్ల బాబి, ప్రతినిధులు కృష్ణమోహన్, నాళంరోశయ్య, శ్రీఘాకోళ్లపు సీతారామాంజనేయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పద్మభూషణ్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి

స్మోకింగ్, డ్రింకింగే లివర్ వ్యాధులకు మూలం

గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యనిపుణుడు డాక్టర్ నాగేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 27 : దేశంలో లివర్ వ్యాధుల చికిత్సలో అత్యాధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని, రాబోయే పదేళ్లలో ఈ రంగంలో అమెరికాతో సమానంగా ఎదుగుతామని గ్యాస్ట్రో ఎంటరాలజీ సూపర్‌స్పెషాలిటీ వైద్యనిపుణుడు, పద్మభూషణ్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి (ఏఐజీఈ, హైదరాబాద్) అన్నారు. రాజమహేంద్రవరంలో గ్యాస్ట్రో ఎంటరాలజీ సొసైటీ, ఇండియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరగనున్న 6వ వార్షిక రాష్ట్ర స్థాయి సదస్సుకు తొలిరోజు శనివారం హాజరై మాట్లాడారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, వ్యాయామం, స్మోకింగ్, డ్రింకింగ్‌లను మానుకోవడం ద్వారా చాలా వరకూ లివర్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. బెంగుళూరుకు చెందిన డాక్టర్ నరేష్‌భట్, చెన్నయ్‌కు చెందిన డాక్టర్ టీఎస్ చంద్రశేఖర్ ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం గ్యాస్ట్రో సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అగస్త్యరాజు శ్రీనివాసరావు, సెక్రటరీ డాక్టర్ వి.శ్రీరాములు, కోశాధికారి డాక్టర్ ఉమాకాంత్, ఉపాధ్యక్షులు డాక్టర్ వరుణ్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ స్వాప్నిక, డాక్టర్ కవిత పాల్గొన్నారు.

తెలుగుదేశం పిలుస్తోంది

రేపే.. రా కదలి రా..



కాతేరులో సభ ఏర్పాట్లకు భూమి పూజ చేసిన యనమల, రాజప్ప,గోరంట్ల , రవి, బత్తుల

- రాజమహేంద్రవరం రూరల్ కాతేరులో బహిరంగ సభ
- 23 ఎకరాల్లో వేదిక ఏర్పాట్లు
- చంద్రబాబు నాయుడు హాజరు
- ఏర్పాట్లకు యనమల, రాజప్ప, గోరంట్ల భూమి పూజ

రాజమహేంద్రవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని కాతేరులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఈనెల 29న తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఈ సభ ఏర్పాట్లను శనివారం ఉదయం 9.30 గంటలకు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప, జోన్- 2 కోఆర్డినేటర్ రవి, జనసేన రాజానగరం ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నేతలు యర్రా వేణు గోపాల్‌రాయుడు, కోనేరు నవీన్ తదితరులు భూమి పూజ చేశారు. వేద మంత్రాల మధ్య రాట పాతి పనులు ప్రారంభించారు. అనంతరం ప్రియాంక గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న ఈ సభకు జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల నుంచి అత్యధికంగా క్యాడర్ తరలి రావాలన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ 23 ఎకరాల్లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హెలిప్యాడ్, పార్కింగ్ ఏర్పాట్లు, భోజన ఏర్పాట్లు కూడా చేస్తున్నట్టు చెప్పారు. చంద్రబాబు సభకు పార్టీ కార్యకర్తలు, నేతలు, జనసైనికులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపు ఇచ్చారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ రూరల్ నుంచి అన్నివర్గాల ప్రజలు వచ్చేలా ప్రచారం చేయాలన్నారు. కనీవినీ ఎరుగని రీతిలో ఈసభ జరగనున్నదని, ఏర్పాట్లు చూసి వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, అంగర రామ్మోహనరావు, చిల్లా జగదీశ్వరి, పెచ్చెట్టి చంద్రమౌళి, డొక్కా నాథ్‌బాబు, వాసిరెడ్డి రాంబాబు, చెల్లుబోయిన శ్రీనివాస్, మజ్జి పద్మావతి, గంగిన హనుమంతరావు, మార్ని వాసుదేవ్, పండూరి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



స్థానిక ప్రియాంక గార్డెన్స్‌లో జరిగిన రూరల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

రేపు చంద్రబాబు పర్యటన ఇలా...

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఈనెల 29న టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాజమహేంద్రవరం రానున్నారు. రూరల్ నియోజకవర్గం పరిధిలోని కాతేరులో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా.. సభకు ఆయన హాజరవుతున్నారు. దీనికోసం ఆయన 29న నెల్లూరు జిల్లాలో పర్యటన ముగించుకుని ఉదయం 11.15గంటలకు ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన 11.25 గంటలకు బయలుదేరి కాతేరులోని మల్లు లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు వస్తారు. 11.45 గంటలనుంచి ఒంటిగంట వరకూ బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం 1.50కు బయలుదేరి కాతేరులో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 2గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని వడ్లమూడి వెళతారు.

అపరాధ రుసుముతో..
ఇంటర్ పరీక్షల ఫీజుకు రేపే చివరి తేదీ

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలవల్ల ఇప్పటి వరకూ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు-2024 నిమిత్తం ఫీజు చెల్లించని వారు తత్కాల్ స్కీం కింద అపరాధ రుసుం రూ.3వేలతో ఈనెల 29 (సోమవారం) సాయంత్రం 5గంటలలోపు చెల్లించాలని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం సూచించారు. జనరల్, ఒకేషనల్ విభాగాల్లోని రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల బాధ్యులు చొరవ చూపాలన్నారు. విద్యార్థులు చెల్లించిన ఫీజును ఆన్‌లైన్ పేమెంటు ద్వారా బోర్డుకు ప్రిన్సిపాల్స్ జమచేయవచ్చన్నారు.

రేపు వికాసలో జాబ్ మేళా : పీడీ

కాకినాడసిటీ, జనవరి 27: ఈనెల 29న కాకినాడలోని వికాస కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో మెరైన్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఎస్ఆర్ అకౌంటెంట్, ఈవో డీల్స్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఇండో ఎంఐఎం కంపెనీలో టెక్నీషియన్, సీఐఈ ఆటోమోటివ్ ఇండియా లిమిటెడ్‌లో టెక్నీషియన్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్) ఉద్యోగాలతో పాటు డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 30 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్: 7799376333లో సంప్రదించాలన్నారు.

ఫిబ్రవరి 3కు మారిన
'ఉమ్మడి' జిల్లా పరిషత్ సమావేశం

కాకినాడ సిటీ, జనవరి 27: ఈనెల 30వ తేదీన జరగాల్సిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం అనివార్య కారణాలవల్ల ఫిబ్రవరి 3వ తేదీకి మార్పు చేసినట్లు జడ్పీ సీఈవో ఏ.రమణారెడ్డి తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 నుంచి జడ్పీ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో జడ్పీచైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధశాఖల ద్వారా జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ప్రగతి ప్రధాన ఆజెండాగా సమీక్షిస్తారన్నారు. సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల పూర్తి సమాచారంతో 3వ తేదీ ఉదయం 10.30కు హాజరుకావాలని సీఈవో ఒక ప్రకటనలో కోరారు.

'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ మేళం' అలరిస్తోంది

- హీరో సుహాస్, హీరోయిన్ శివాని



మాట్లాడుతున్న హీరో సుహాస్, హీరోయిన్ శివాని

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 27: వచ్చేనెల 2న విడుదల కాబోతున్న అంబాజీపేట మేరేజ్ బ్యాండ్ మేళం సినిమా ప్రేక్షకులందరినీ అలరిస్తోందని ఆ చిత్రం హీరో సుహాస్, హీరోయిన్ శివాని తెలిపారు. ఈ సినిమా ప్రమోషన్ వర్క్‌లో భాగంగా చిత్ర బృందం శనివారం రాజమహేంద్రవరం విచ్చేసింది. ఈ సందర్భంగా స్థానిక షెల్టాన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో సుహాస్ మాట్లాడారు. ఈ సినిమా విడుదలయ్యాక ప్రేక్షకుల నుంచి వచ్చే ఆనందం కోసం ఎదురుచూస్తున్నామన్నారు. ప్రమోషన్ వర్క్‌లో భాగంగా విశాఖ, కాకినాడ మీదుగా రాజమహేంద్రవరం వచ్చామన్నారు. కవల పిల్లలైన అక్కా తమ్ముడు పుట్టిన రోజు సందర్భంగా జరిగే సంఘటన ఆధారంగా వాళ్ల జీవితాలు ఎలా మలుపుతిప్పాయన్నది చిత్ర ఇతివృత్తమన్నారు.

కాకినాడలో ఫిబ్రవరి 26న
అప్పా రాష్ట్ర మహాసభలు

గొల్లప్రోలు రూరల్, జనవరి 27: ఆంధ్రప్రదేశ్ పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ మూడవ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 26వ తేదీన కాకినాడలో నిర్వహిస్తున్నట్లు అప్పా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిల్లా చంద్రం తెలిపారు. గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో అసోసియేషన్ విశాఖ, అనకాపల్లి, కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా అప్పా రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రం మాట్లాడుతూ నూతన విద్యావిధానం పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలతో పేదలకు ప్రభుత్వ విద్య దూరమవుతున్నదని తెలిపారు. గ్రామాల్లో పాఠశాలలను విలీనం పేరుతో ఇతర ప్రాంతాలకు తరలిస్తే పేదల పిల్లలు ఎలా చదువుకుంటారని ఆయన ప్రశ్నించారు. వసతిగృహాల్లో మెనూ సక్రమంగా అమలు కావడంలేదని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, ఏళ్ల తరబడి పోస్టులు భర్తీ చేయడంలేదని తెలిపారు. ప్రతి ఏటా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా జిల్లాలకు చెందిన అప్పా ప్రతినిధులు పాల్గొన్నారు.



ఏపీ పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభల పోస్టరును ఆవిష్కరిస్తున్న నాయకులు



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

వాడపల్లికి పోటెత్తిన భక్తజనం

- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.38.4 లక్షలు



నటి వర్షిణికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జనవరి 27: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. వేకుమజామునే స్వామి వారికి సుప్రభాతసేవ ఐశ్వర్యలక్ష్మీహోమం, బాల భోగం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాలనుంచి భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ షర్మిలారెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.38.4 లక్షలు లభించినట్టు ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. అలాగే జబర్దస్త్‌తో పాటు వివిధ బుల్లితెర షోలలో నటిస్తున్న యాంకర్ వర్షిణి శనివారం కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. స్వామివారి చిత్రపటం అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గోదావరి రొయ్య సీడ్ కోసం
మత్స్యకారులపై ఒత్తిడి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

- రెండు వర్గాలతో హైపవర్ అఫీషియల్స్ సమావేశం
- మత్స్యకారులతో మంత్రి వేణు, కలెక్టర్, కోనసీమ అధికారుల చర్చలు

రాజమహేంద్రవరం, జనవరి27(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం బ్యారేజి దిగువ ప్రాంతంలో బ్యారేజి నుంచి నీటి ప్రవాహం ఉన్న సమయాల్లో మత్స్యకారులు వేటాడిన రొయ్యసీడ్‌ను మత్స్యశాఖకు ఇవ్వాలని, కానీ అందరూ ఇవ్వడంలేదని కారణంతో మంత్రి చెల్లుబోయిన వేణు, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధికారులు ధవళేశ్వరం, బొబ్బర్లంక మత్స్యకారులతో చర్చించారు. పూర్వం నుంచి ధవళేశ్వరం బ్యారేజి దిగువన రొయ్యసీడ్ ను ధవళేశ్వరం, బొబ్బర్లంక మత్స్యకారులు వేటాడుతుంటారు. ధవళేశ్వరం మత్స్యకార సొసైటీ 1 నుంచి 70 బ్యారేజీ గేట్ల వరకూ వేటాడుకోవచ్చు. వీరు లీజుకు తీసుకున్నారు. బొబ్బర్లంక సొసైటీ వారు లీజుకు తీసుకోకుండానే చాలా కాలం నుంచి రొయ్య పిల్లల వేట సాగిస్తున్నారు. ధవళేశ్వరం సొసైటీ లీజుకు తీసుకున్న పరిధిలోకి వారు వచ్చేసి వేటాడుతున్నట్టు ఆరోపణ. అది ఒక సమస్య కాగా, ఇక్కడ అసలు సమస్య ఒకటి ఉంది. ప్రతిఏటా అఖండ గోదావరిలో రొయ్య పిల్లలను అధికారులు వదులుతుంటారు. అవి పెద్దవి అయ్యాక, మత్స్యకార్లకు ఉపాధి ఉంటుందనేది వారి లక్ష్యంగా చెబుతుంటారు. కానీ దీనికోసం బ్యారేజి దిగువ రొయ్య పిల్లలను వేటాడేవారు మత్స్యశాఖకు ఉచితంగా రొయ్యపిల్లలు ఇవ్వాలి. ధవళేశ్వరం సొసైటీ వారు ప్రతిఏటా 5 లక్షల పిల్లలను ఇస్తుంటారు. కానీ బొబ్బర్లంక సొసైటీ వారు ఇవ్వడంలేదు. దీనిపై ప్రధానంగా సమావేశం నిర్వహించారు. తాము తమ పెద్దలనాటి నుంచి వేటాడుతున్నామని, ఎప్పుడూ లీజుకు తీసుకోలేదు. రొయ్య పిల్లలూ ఇవ్వలేదని బొబ్బర్లంక సొసైటీ మత్స్యకారులు వాదించారు. కానీ దీనిపై అధికారులు జోక్యం చేసుకుని గతంలో లాగా ఉచితంగా వేటకు వీలులేదని, మారిన నిబంధనల మేరకు లీజుకు తీసుకుని రొయ్య పిల్లలను ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. పైగా ఎంత సీడ్ వేటాడుతున్నారో కూడా చెప్పాలన్నారు. ఈ పిల్లలను తిరిగి గోదావరిలో వదలడంవల్ల అవి ఎదిగిన తర్వాత ఎగువ దిగువ మత్స్యకారులకు ఉపాధికి ఉపయోగపడతాయని చెప్పారు. మంత్రి వేణు మాట్లాడుతూ ధవళేశ్వరం, బొబ్బర్లంకల్లో మత్స్యకారులందరికీ ఉపాధి కలిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ డా. కె.మాధవీలత మాట్లాడుతూ ధవళేశ్వరం సొసైటీ మాదిరిగా బొబ్బర్లంక సొసైటీ కూడా లీజుకు దరఖాస్తు చేసుకోవాలని, అది పూర్తయిన తర్వాత ఏరియాను విభజిస్తారని, ఎవరి పరిధిలో వారు వేటాడుకోవచ్చని చెప్పారు. మత్స్యశాఖ జేడీ కృష్ణారావు మాట్లాడుతూ అందరూ కచ్చితంగా రొయ్యసీడ్ ఇవ్వాల్సిందే నన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ పి.జగదీశ్, జేసీ ఎన్.తేజ్‌భరత్, అంబేడ్కర్ కోనసీమజిల్లా జేసీ శ్రీవాస్ నూపర్ అజయ్, ఏఎస్పీ ఖాదర్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

- ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్ కుమార్ మిశ్రా
- అత్యాశతో చిక్కుల్లో పడొద్దు : సీఐడీ ఏఎస్పీ పాపారావు



సదస్సులో మాట్లాడుతున్న సీఐడీ అడిషనల్ ఎస్పీ పాపారావు

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటే సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడుతుందని ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. ఐజీఎన్‌సీఎస్ సౌజన్యంతో రాజమహేంద్రవరం ప్రాంతీయ సీఐడీ అధికారి ఆధ్వర్యంలో సైబర్ నేరాల తీరు, వాటిని అరికట్టే విధానాలపై పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలపై రూపొందించిన బ్రోచర్‌ని ఆవిష్కరించి మాట్లాడారు. అంతగా చదువుకోని వాళ్లు ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడుతుంటే బాగా చదువుకున్న వారు సైతం వాటిని ఎదుర్కోవడంలో విఫలం కావడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఇటీవల నమోదవుతున్న కేసుల్లో ఎక్కువగా అలాంటివే ఉంటున్నాయన్నారు. దీనికి సాంకేతికతపై అవగాహన లేకపోవడమే అసలు కారణమన్నారు. సాంకేతిక పరికరాలను వినియోగించే క్రమంలో ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోసం జరిగిందని గ్రహించిన వెంటనే టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి గానీ, సైబర్ క్రైం పోలీసులకుగానీ ఫిర్యాదు చేయాలన్నారు. సీఐడీ అదనపు ఎస్పీ పాపారావు మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులను అత్యాశతో క్లిక్ చేస్తూ చిక్కుల్లో పడుతున్నారని తెలిపారు. మోసం చేయడానికి సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో ఆశ కల్పిస్తుంటారని గ్రహించాలన్నారు. బ్యాంక్ అకౌంట్, వ్యక్తిగత, ఆధార్, పాన్, ఏటీఎం నెంబర్, పిన్, ఓటీపీ వివరాలను అపరిచితులతో పంచుకోకూడదన్నారు. హైదరాబాద్‌లోని ఇన్‌ఫర్మేషన్ అండ్ సైబర్ సెక్యూరిటీ రీసెర్చ్ మాజీ సీఐఎస్‌వో బీ.శ్రీనివాస్ ఇంటర్నెట్, సెల్‌ఫోన్ల వినియోగంలో కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఓటీపీలు చెప్పమనడం, మోసపూరిత లింకులు, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్లు ఇబ్బందులకు గురిచేస్తాయన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం ఉంచకపోవడమే మేలన్నారు. టోల్‌ఫ్రీ నెం.1930 ఆవశ్యకత గురించి సీఐడీ హెడ్ క్వార్టర్స్ అడిషనల్ ఎస్పీ సీహెచ్ సురేశ్ వివరించారు. ఉదయం సెషన్‌లో ఉమ్మడి గోదావరి జిల్లాల పోలీసు సిబ్బంది, జీఎంఎస్‌కే, మధ్యాహ్నం సెషన్‌లో కాలేజీ విద్యార్థులు, బ్యాంకు సిబ్బంది, నెట్‌వర్క్ ప్రొవైడర్లు హాజరయ్యారు. వారికి సైబర్ క్రైంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విశదీకరించడంతో పాటు సంబంధిత మెటీరియల్‌ని అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు బి.రామకృష్ణ, సీహెచ్ పెంటారావు, ఇన్‌స్పెక్టర్లు జీవీవీ సత్యనారాయణ, ఎం.బాల కృష్ణ, ఐ.గోపాలకృష్ణ, డి.విజయ్‌కుమార్, పీవీవీ నరసింహరావు, ఎం.శేషు, వి.శ్రీనివాస్, సీహెచ్ వెంకటేశ్వరరావు, జి.రమేశ్ పాల్గొన్నారు.

దళిత సర్పంచ్‌పై అధికార పార్టీ వేధింపులు

- సర్పంచ్‌కు సమాచారం లేకుండా డీపీవో సమావేశం
- అధికార పార్టీ నాయకుడి ప్యాలెస్ సీసీ రోడ్డు నిర్మాణానికి తీర్మానం



ఆత్రేయపురం గ్రామపంచాయతీలో డీపీవో కృష్ణకుమారి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జనవరి 27: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం గ్రామ దళిత సర్పంచ్ గెడ్డం సుధారాణిపై అధికారపార్టీ వేధింపులకు పాల్పడుతుందని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. 2020లో జరిగిన పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్‌గా సుధ టీడీపీ తరుపున ఎన్నికయ్యారు. వార్డు సభ్యులు అధికార పక్షానికి చెందిన వారు కావడంతో దళిత సర్పంచ్‌కు అధికార పార్టీ నాయకులు వేధింపులకు పాల్పడుతున్నారని సుధ ఆరోపిస్తున్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికార పార్టీ నాయకులు ఇబ్బందులకు గురిచేస్తుండగా అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆమె పేర్కొన్నారు. పంచాయతీకి స్వాధీనం చెయ్యని భూమిలో అధికార పార్టీ నాయకుడికి చెందిన ప్యాలెస్‌కు సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించేందుకు నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ వార్డు సభ్యులు తీర్మానం ఆమోదించడం సర్పంచ్‌లు వ్యతిరేకించడంతో వివాదం చెలరేగింది. శనివారం సర్పంచ్ సుధకు తెలియకుండానే డీపీవో కృష్ణకుమారి అభ్యర్థన మీటింగ్‌ను పంచాయతీలో నిర్వహించడంతో విషయం తెలుసుకున్న సర్పంచ్ అక్కడికి చేరుకుని డీపీవోను నిలదీశారు. సర్పంచ్‌కు కనీస సమాచారం ఇవ్వకుండా అభ్యర్థన మీటింగ్ నిర్వహించడం ఎంతవరకూ న్యాయమని ఆమె ప్రశ్నించారు. పేద ప్రజలకు అవసరమైన కనీస పనులను అభివృద్ధికి అడ్డుతగులుతూ అధికార పార్టీ నాయకుడికి స్వప్రయోజనం చేకూర్చే పనులు ఆమోదించడం ఎంత వరకూ సబబు అని ఆమె నిలదీశారు. సర్పంచ్ అభ్యంతరాలను లెక్కచేయని డీపీవో కృష్ణకుమారి అధికార పార్టీకి అనుకూలంగా వర్క్స్ కమిటీని ఏర్పాటు చేసి జిల్లా కలెక్టర్ ఆమోదంకోసం నివేదికను పంపించడంపై సర్పంచ్ మండిపడ్డారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ఈవిషయంపై డీపీవో కృష్ణకుమారిని వివరణ కోరగా వార్డు సభ్యుల అభ్యర్థన మేరకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి పనులకు ఆమోదం తెలపలేదని మెజార్టీవార్డు సభ్యుల అభిప్రాయం మేరకు ఏడుగురుతో వర్క్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. దీనిని కలెక్టర్ ఆమోదం కోసం పంపించామన్నారు.

చీటింగ్ నేరంపై అవుట్‌సోర్సింగ్ సిబ్బంది అరెస్ట్

సామర్లకోట, జనవరి 27: సామర్లకోట మున్సిపాల్టీలో అవుట్‌సోర్సింగ్ సిబ్బందిగా పనిచేస్తున్న కమ్మిల శ్రీనువాస్ అనే యువకుడు ఒక మహిళా వివాదాన్ని సెటిల్మెంట్ చేస్తానని, తాను చెబితే అధికారులు, రాజకీయ నాయకులు సిఫార్స్ చేస్తారని నమ్మబలికి ఆమె వద్ద నుంచి రూ.1.27లక్షలు వసూలు చేసి ఆ తర్వాత ముఖం చాటేసిన కేసులో శ్రీనువాస్‌ను సామర్లకోట పోలీసులు అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపర్చడంతో రిమాండ్ విధించినట్లు సామర్లకోట పోలీసులు తెలిపారు. తనకు జరిగిన ఒక సంఘటనలో ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు రాగా సదరు మహిళను నమ్మించి తనకు పలుకుబడి ఉందని చెప్పి ఆమె నుంచి డబ్బులు వరుసగా వసూలు చేశాడు. తీరా తన సమస్య పరిష్కారం కాకపోవడంతో నేరుగా పోలీసు అధికారులకు జరిగిన మోసాన్ని వివరించడంతో పోలీసులు తక్షణం విచారించి మోసాలకు పాల్పడినట్లు నిర్ధారించి అరెస్ట్‌చేసి కోర్టు ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు సామర్లకోట పోలీసులు శనివారం తెలిపారు. ఇక నుంచి శ్రీనువాస్‌ను మున్సిపల్ విధులకు అనుమతించేది లేదని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు.

చెట్టుని ఢీ కొట్టిన కారు

- షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం



చెట్టుకు ఢీకొని దగ్ధమవుతున్న కారు


యానాం. జనవరి 27: యానాం శివారు ఇసుకకాలువ వద్ద అదుపుతప్పి కారు రోడ్డు డివైడర్‌ను, చెట్టును ఢీకొట్టింది. షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం యానాం నుంచి స్నేహితులతో కలిసి దొమ్మేటిపేటలో ఉన్న స్నేహితుడి కొబ్బరితోటలో భోజనాలు చేయటానికి వెళుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ ఇసుక కాలువ వద్ద అదుపుతప్పి ఒక పక్కకు ఒరిగింది. ప్రమాదం జరిగే సమయానికి నలుగురు యువకులు ప్రయాణిస్తున్నట్లు సమాచారం. కారులో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో క్షణాల వ్యవధిలో కారు దగ్ధమైంది. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న అగ్నిమాపక వాహనం మంటలను అదుపుచేసింది. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. అయితే కారులో ఉన్న వారు యానాం వాసులుగా గుర్తించారు. వీరిలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా మెరుగైన వైద్యంకోసం కాకినాడ తరలించారు. ఈసంఘటలో కారు పూర్తిగా దగ్ధమైంది. ఈసంఘటనపై యానాం ట్రాఫిక్ ఎస్ఐ పువ్వల వీరభద్రస్వామి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కె.పెదపూడి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

- నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేసిన సర్పంచ్
- కార్యదర్శి ఫిర్యాదుతో చెక్ పవర్ రద్దు చేసిన డీపీవో

అంబాజీపేట, జనవరి 27: నిబంధనలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం అందించిన 15వ ఆర్థిక సంఘం నిధులను చెక్ ద్వారా బ్యాంకు నుంచి నేరుగా డ్రా చేసిన అంబాజీపేట మండలం కె.పెదపూడి సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి కె.కృష్ణకుమారి ఉత్తర్వుల జారీ చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా అంబాజీపేట మండలం కె.పెదపూడి మేజర్ పంచాయతీకి గత ఏడాది ఆగస్టు నెలలో 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.4లక్షలు పంచాయతీ ఖాతాకు జమయ్యాయి. గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లకు సంబంధించి వీటిని చేసినట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఖాతాకు జమ అయిన మరుసటిరోజు నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ కార్యదర్శి విత్తనాల వెంకటరమణకు తెలియకుండా సర్పంచ్ బీర శాంతి బ్యాంకు నుంచి చెక్ ద్వారా రూ.3.70 లక్షలు డ్రా చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ గ్రామ్ స్వరాజ్ ద్వారా సీఎఫ్ఎంఎస్ ద్వారా అప్‌లోడ్ చేసి నిధులు డ్రా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ నిబంధనలకు వ్యతిరేకంగా సర్పంచ్ శాంతి నిధులు డ్రా చేయడంతో పంచాయతీ కార్యదర్శి గత ఏడాది జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. డిసెంబర్ నెలలో డివిజనల్ పంచాయతీ అధికారి బొజ్జిరాజు, అంబాజీపేట ఈవోపీఆర్డీ బి.మమత పంచాయతీ విత్‌డ్రా చేయడంపై స్థానిక పంచాయతీలో విచారణ చేపట్టారు. విచారణ అనంతరం జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక అందించారు. విచారణను పరిశీలించిన డీపీవో సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దుచేస్తూ జనవరి 25వ తేదీన ఉత్తర్వులు అందించారు. ఈ ఉత్తర్వులను సర్పంచ్‌కు రిజిష్టర్ పోస్టుతో పాటు స్వయంగా అందించాలని తెలిపినట్లు ఈవోపీఆర్డీ మమత తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి



రోళ్లపాలెం బైపాస్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన భార్యాభర్తలు గారపాటి వెంకట్రావు, మంగతాయారు

- కుమార్తెను చూసి వెళుతుండగా ప్రమాదం
- మోటారు సైకిల్‌ను మినీ వ్యాన్ ఢీకొని మృతి

అమలాపురం రూరల్, జనవరి 27: అత్తవారింటి వద్ద ఉన్న కుమార్తెను చూసేందుకు పిల్లావారిగరువుకు వచ్చిన భార్యాభర్తలు తిరుగు ప్రయాణంలో మోటారుసైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన మినీవ్యాన్ వేగంగా వచ్చి మోటారుసైకిల్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన రోళ్లపాలెం బైపాస్ రోడ్డులో శనివారం రాత్రి జరిగింది. అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం బోడసకుర్రులోని టిడ్కో గృహాల సముదాయంలో ఉంటున్న గారపాటి వెంకట్రావు(55), భార్య మంగతాయారు(50)లు కుమార్తెను చూసేందుకు మండల పరిధిలోని పిల్లావారిగరువుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో బైపాస్ రోడ్డులో బోడసకుర్రువైపు వెళుతుండగా రోళ్లపాలెం సమీపానికి వచ్చేసరికి మినీవ్యాన్ డ్రైవరు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ కె.క్రిష్టఫర్, రూరల్ సీఐ పి.వీరబాబు, అల్లవరం, పట్టణ ఎస్ఐలు హరీష్‌కుమార్, సత్యనారాయణలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన వ్యాను డ్రైవరుపై కేసు నమోదుచేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

మెరుగైన వైద్యం అందించాలి

● సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



వైద్యాధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం, జనవరి 27: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సబ్‌కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యంపై సూపరింటెండెంట్ కె.లక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి వార్డు, అధునిక ల్యాబ్ పరీక్షా పరికరాలను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

● ఫిబ్రవరి 10లోగా దరఖాస్తు చేసుకోవాలి

రంపచోడవరం, జనవరి 27: మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖలో రంప గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు, దేవీపట్నం మండలం చొప్పకొండ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులకు అర్హులైన స్త్రీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమగ్ర శిశు సేవా అభివృద్ధి అధికారిణి సంధ్యారాణి తెలిపారు. దరఖాస్తులను ఫిబ్రవరి పదో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించా రు. అంగన్‌వాడీ కార్యకర్తకు పదోతరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని, వయస్సు 35 సంవత్సరాలు కలిగి ఉండాలన్నారు. పూర్తి సమాచారం కోసం సంబంధిత ఐసీడీఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు

ఎటపాక: ఎటపాక మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో విజయగౌరి ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని జగ్గవరం మినీ అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ పోస్టుకు, అలాగే గన్నవరం-1 కేంద్రంలో ఆయా, ఎన్టీఆర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా, కాపుగొంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఫిబ్రవరి 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను సీడీపీవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

గిరిజనులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

● దొండగూడెం గ్రామాన్ని సందర్శించిన ఏఎస్పీ



గ్రామస్థులకు క్రీడా సామగ్రి, దుప్పట్లు అందజేస్తున్న ఏఎస్పీ రాహుల్ మీనా

మోతుగూడెం, జనవరి 27: గిరిజనులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, గ్రామంలో ఎటువంటి గొడవలు జరుగకుండా చూసుకోవాలని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్ మీనా అన్నారు. శనివారం ఆయన చింతూరు మండలంలోని మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో దొండగూడెం గ్రామాన్ని సందర్శించారు. అక్కడ ఉన్న ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ఆయన మాట్లాడుతూ రాబో యే ఎన్నికలు సజావుగా జరిగేలా అందరూ సహకరించాలని, ఎవరైనా గొడవలు సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన వృద్ధులకు దుప్పట్లు, యువకులకు క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. ఆయన వెంట మోతుగూడెం ఎస్ఐ బి.గోపాలరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సెర్ప్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● ఐటీడీఏ ఎదుట ధర్నా



ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

రంపచోడవరం, జనవరి 27 : సెర్ప్ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం సెర్ప్ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సెర్ప్‌ను ప్రభుత్వ సంస్థగా గుర్తించి తద్వారా ఉద్యోగులకు కేడర్ ఫిక్స్ చేస్తూ పే స్కేల్ అమలుచేసి సర్వీస్ రెగ్యులర్ చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న సీలింగ్ విధానాన్ని మార్పుచేసి ఈపీఎఫ్ అమలు చేయాలన్నారు. హెచ్ఆర్ పాలసీ ప్రకారం రూల్స్ ఆఫ్ రిజర్వేషన్లు వర్తింపజేస్తూ ప్రమోషన్లు కల్పించాలన్నారు. కారుణ్య నియామకాలు జరిపి మరణించిన కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. తెలంగాణాలో సెర్ప్ ఉద్యోగులకు అమలు చేసిన కేడర్ ఫిక్షేషన్ ఏపీలో కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. సెర్ప్ ఉద్యోగులు ఎ.శ్రీనివాసరావు, బి.రాధ అపర్ణ, డి.దుర్గాప్రసాద్, కె.శ్రీనివాసుదొర, జీవీ కృష్ణ, యూ.జేమ్స్ పాల్గొన్నారు.

కిమ్మురులో గడపగడకు మన ప్రభుత్వం

అడ్డతీగల, జనవరి 27: మండలంలోని కిమ్మురు గ్రామంలో శనివారం గడపగడకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ స్థానిక ఎమ్మెల్యే ఎస్.ధనలక్ష్మి పాల్గొని ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

తుప్పల తొలగింపు



ఎటపాక, జనవరి 27: గూంజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం కృష్ణవరంలో రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు, తుప్పలను తొలగించారు. కృష్ణవరం గ్రామం నుంచి గొందిరాజుపేట గ్రామ శివారు ప్రాంతం వరకు రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్ల, తుప్పలను తొలగించారు. సుమారు రెండు కిలోమీటర్ల వరకు తుప్పలను తొలగించారు. సంస్థ కోఆర్డినేటర్ వెంకటేష్, గ్రామస్థులు చిచ్చడి సూరిబాబు, చిచ్చడి రామారావు, చిచ్చడి మల్లిఖార్జున్ , కొవ్వాసి వీరేంద్ర, మాజీ ఎంఈటీసీ పద్దం సత్తెమ్మ, సన్నవ శ్రీను, సోయం రాంప్రసాద్, తమ్మయ్య పాల్గొన్నారు.

దేవీపట్నం సర్పంచ్‌కు మాజీ ఎమ్మెల్యే వంతల పరామర్శ

దేవీపట్నం, జనవరి 27: ఇటీవల అనారోగ్యంతో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి తల్లి మరణించడంతో శనివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంతల రాజేశ్వరి సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట రాష్ట్ర బీసీసెల్ నాయకులు జెఎస్ గణేష్, రాష్ట్ర రైతు ఆర్గనైజింగ్ సెక్రటరి మాగాపు బాబురావు, ప్రధాన కార్యదర్శి పెంటకోట అనంతమోహన్, లంకహరిబాబు, సిద్ద వెంకన్నదొర, దారా వెంకన్న, కొత్తపల్లి అన్న వరం, బాపన్నదొర, నాని, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

లెక్చరర్ తేజశ్వినికి డాక్టరేట్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 27: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ గార తేజస్వినికి డాక్టరేట్ డిగ్రీ సాధించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఆమె డాక్టరేట్ పొందారు. 'లోహ ఆక్సైడ్లు, హరిత నానో సంశ్లేషణ వాటిని జీవసంబంధ, కాలుష్య నివారణకు ఉపయోగించడం' అనే అంశంపై కె.భాగ్యలక్ష్మి పర్యవేక్షణలో తేజస్విని పరిశోధన చేశారు. డాక్టరేట్ సాధించిన తేజస్వినిని ప్రిన్సిపాల్ కె. రామచంద్రరావు, రసాయనశాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, ఈసుబ్ బాషా, మల్లికార్జున, యాకోబ్ అభినందించారు.

రోడ్లు కూడా వేయించలేని దుస్థితి

» ప్రభుత్వంపై పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప విమర్శ
» పందలపాకలో టీడీపీ కార్యాలయం ప్రారంభం
» పార్టీలో చేరిన వంద మంది వైసీపీ కార్యకర్తలు

బిక్కవోలు, జనవరి 27: వైసీపీ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పు చేసినా కనీసం గ్రామాల్లో రోడ్లు కూడా వేయించలేని దుస్థితిలో వుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పందలపాక గ్రామంలో శనివారం ఆయన టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో గ్రామానికి చెందిన వంద మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి చినరాజప్ప కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం గాలికి వదిలేశారన్నారు. చంద్రబాబు, పవన్ కలిసాక ప్రజల్లో ఒక వేవ్ వచ్చి మార్పు వచ్చిందని, దీంతో వైసీపీలో విలువ లేకుండా వున్న కార్యకర్తలు టీడీపీ న్యాయం చేస్తుందని పార్టీలో చేరుతున్నారన్నారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి మాని, ప్రత్యర్థి వర్గం వుండకూడదంటూ టీడీపీ నేతలు, కార్యకర్తలపై పోలీసు కేసులు నమోదు చేస్తోందని విమర్శించారు. అనపర్తి నియోజకవర్గంలో 185 కేసులు నమోదు చేశారని, తనపై 35 కేసులు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో జనసేన, టీడీపీ కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. అనంతరం గ్రామానికి చెందిన గుత్తుకోల్లు దుర్గాప్రసాద్ అనారోగ్యంతో వుండడంతో అతని వైద్యానికి గ్రామశాఖ సమకూర్చిన రూ.50 వేలను ప్రసాద్ తల్లిదండ్రులకు అందజేసారు. ఈనెల 29న రాజమహేంద్రవరం కాతేరు వద్ద చంద్రబాబునాయుడు నిర్వహించే రా కదలిరా సభకు కార్యకర్తలందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకు ముందు గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు తొస్సిపూడి వంతెన వద్ద నుంచి పందలపాక టీడీపీ కార్యాలయం వరకూ భారీ బైక్ ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వనమాడి కొండబాబు, మోకా ఆనందసాగర్, ఆనందరావు, వెంకటేశ్వరరావు, పడాల సూర్యనారాయణరెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, సబ్బారపు సూర్యనారాయణ, పడాల చినబుజ్జి, వల్లూరి తాతబ్బాయిచౌదరి, అనుసూరి నాగేశ్వరరావు, గుణ్ణం శ్రీనివాసచౌదరి, కర్రి పైడారావు, కర్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రా.. కదలిరా సభను విజయవంతం చేయండి

అనపర్తి/రంగంపేట, జనవరి 27: ఈనెల 29న జరగబోయే రా.. కదలిరా బహిరంగ సభకు విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృ ష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం అనపర్తిలోని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలోను, రంగంపేట మండలం వడిశలేరులో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలోను ఆయన మాట్లాడారు. 29న కాతేరులో జరిగే బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, కార్లు, మోటారుసైకిళ్లపై తరలివచ్చే విధంగా నాయకులు జన సమీకరణ చేయాలన్నారు. అన్ని ప్రాంతాల నుంచి ఉదయం 8 గంటలకే బయలుదేరాలని సూచించారు. ఇదిలా ఉండగా రంగంపేట మండలానికి పార్టీ పరిశీలకుడిగా కాకినాడ రామారావును నియమించినట్టు చెప్పారు. సమావేశాల్లో అనపర్తిలో పార్టీ పరిశీలకుడు నులుకుర్తి వెంకటేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి వెంకటరామారెడ్డి పాల్గొనగా వడిశలేరులో ఆళ్ల గోవింద్, నీలపాల త్రిమూర్తులు, వెలుగుబంటి సత్తిబాబు, పోతుల వెంకటరావు, అడబాల వెంకటరావు, సుబ్బారెడ్డి, దేవదానబాబా, మాచిన వెంకన్న దొర తదితరులు పాల్గొన్నారు.



పందలపాకలో టీడీపీలో చేరిన కార్యకర్తలతో చినరాజప్ప, రామకృష్ణారెడ్డి, వనమాడి కొండబాబు, మోకా ఆనందసాగర్, ఆనందరావు తదితరులు

చంద్రబాబు సభను విజయవంతం చేయండి

కోరుకొండ, జనవరి 27: ఈ నెల 29న కాతేరులో జరగనున్న చంద్రబాబు సభను విజయవంతం చేయాలని, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరికి మద్దతుగా నిలవాలని పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ పిలుపునిచ్చారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన ప్రకటనతో టీడీపీ శ్రేణులు పార్టీపై ప్రేమతో కొంత ఆవేదన చెందిన మాట నిజమేనని ప్రస్తుత రాష్ట్ర పరిస్థితులు అర్థం చేసుకోవాలని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొంతమంది నాయకులు వారి వ్యక్తిగత స్వార్థం కోసం పార్టీ శ్రేణులను రెచ్చగొట్టి అధికార పార్టీకి మద్దతుగా పని చేస్తున్నారన్న విషయాన్ని గ్రహించాలన్నారు. నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులంతా తమ సత్తాను చాటాలని, బీఆర్ చౌదరి ప్రతిష్ఠను పెంచే విధంగా పనిచేయాలన్నారు. తాను కూడా ఆయనతో కలిసి చంద్రబాబు సభను విజయవంతం చేసే కార్యక్రమాల్లో పాల్గొంటానన్నారు.

యువగళం పాదయాత్రకు 365 రోజులు పూర్తి

రాజమహేంద్రవరంలో వేడుక చేసిన ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 27: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర చేపట్టి శనివారానికి 365 రోజులు పూర్తి చేసుకుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం శ్యామలనగర్ రామాలయం సెంటర్‌లో తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవి వరప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుక చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్‌కు ఆయురారోగ్యాలు సిద్ధించాలని టీడీపీ నేతలంతా 108 కొబ్బరికాయలు కొట్టారు. నక్కా సంతోష్ సమకూర్చిన మూడు ట్రైసైకిళ్లను దివ్యాంగులకు అందించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు, నక్కా చిట్టిబాబు, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, నూర్ బాషా, షేక్ సుభాన్, జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీను పాల్గొన్నారు.



కొబ్బరికాయలు కొడుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



గోకవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎలక్ట్రీషియన్లు

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

గోకవరం, జనవరి 27: గోకవరం యునైటెడ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ఎలక్ట్రీషియన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ఎం.కార్తీక్.. థామస్ ఆల్వా ఎడిషన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, యూనియన్ జెండాను ఎగురవేశారు. అనంతరం సభ్యులు యూనియన్ కార్యాలయం నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్‌వీఎస్.రాజు, పాలెపు నాగేశ్వరరావు, కంబాల బాబ్జీ, గునుపల్లి శివ, సియాధుల సూర్యప్రకాష్, దుర్గ, అర్జునుడు పాల్గొన్నారు.

ప్రైవేటు ఎలక్ట్రీషియన్లకు రూ.2.50 లక్షల విరాళం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 27: ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్‌కు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ రూ.2.50 లక్షలు విరాళం అందించారు. రాజమహేంద్రవరం శేషయ్యమెట్ట వద్ద గల సాయిరామ్ రజక కల్యాణ మండపంలో జరిగిన ఎలక్ట్రీషియన్ డే కార్యక్రమానికి ఆయన హాజరై థామస్ ఎడిసన్‌కు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి శ్రీనివాస్, తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిశీలకుడు నక్కా చిట్టిబాబు, టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు బుడ్డిగ రవిలను అసోసియేషన్ తరపున సత్కరించారు. కార్యక్రమంలో సంఘాధ్యక్షుడు యాళ్ళ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ కోమండురి గణేష్ బాబు, సెక్రటరీ పత్తి మహేష్, మరడ పరశురామ్, బోడకుర్తి గోపాలకృష్ణ, కోలాటి సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

రామసేన సభ్యత్వాలు ప్రారంభం

గోకవరం, జనవరి 27: గోకవరం మండల పరిధిలో విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన సభ్యత్వాలను శనివారం నుంచి ప్రారంభించినట్టు ఆ సంఘం వ్యవస్థాపకుడు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. ముందుగా ఆయన సీఎండీ కేవీఎస్‌పీపీ ఫిన్స్ లేఅవుట్‌లోని కార్యాలయంలో మొదటిగా సభ్యత్వం స్వీకరించారు. అనంతరం పలువురికి రామసేన సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావనతో మెలగాలన్నారు. ప్రతి గ్రామంలో సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హిందూ ధర్మ పరిరక్షణకు రామసేన సభ్యత్వాన్ని స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్ప, ఇనగోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాధశర్మ పాల్గొన్నారు.

ఫైలేరియా టాస్ సర్వే తనిఖీ

బిక్కవోలు, జనవరి 27: ఊలపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఫైలేరియా టాస్ సర్వేను శనివారం జోనల్ మలేరియా అధికారి డాక్టర్ బి. సుబ్రహ్మణ్యేశ్వరి తనిఖీ చేసారు. ఈసందర్భంగా ఆమె ఇంటింటా వెళ్లి పలువురు గ్రామస్తులను సర్వే గూర్చి అడిగి తెల్సుకుని సంతృప్తి వ్యక్తం చేసారు. అనంతరం బిక్కవోలు పీహెచ్‌సీని తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు అందజేసారు. కార్యక్రమంలో మండల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాదేవి, ఎన్‌వి. సత్యనారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు కార్మికులు కృషి

కడియం, జనవరి 27: పారిశుధ్య నిర్వహణలో గ్రామాల్లో చెత్తను తొలగించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పారిశుధ్య కార్మికులు ఎంతో కృషి చేస్తారని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా శనివారం వేమగిరితోటలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అక్కడికక్కడే పరిష్కరించే విధంగా అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రత్నకుమారి, ఈవోపీఆర్డీ వైవీఎస్ఎస్ లక్ష్మి, యాదల స్టాలిన్, గిరజాల బాబు, వెలుగుబంటి అచ్యుతరామ్, గుబ్బల నాగార్జున, కట్టా జమీందారు, ఎన్.గణపతిరావు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు సేవా పురస్కారం



రాజానగరం, జనవరి 27: మండలంలోని ముక్కినాడ గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న యర్రగుంట నాగ దుర్గాప్రశాంత్‌కు ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రం లభించింది. ఈ మేరకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా కాకినాడలో సర్కిల్ పర్యవేక్షణ ఇంజనీర్ బీవీ సత్యనారాయణమూర్తి చేతులమీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌ను మండల జేఈ సంపత్‌కుమార్, డీఈ రవి తదితరులు అభినందించారు.

ఎస్టీయూ మండలాధ్యక్షుడిగా ధర్మరాజు

దివాన్‌చెరువు, జనవరి 27: ఎస్టీయూ రాజానగరం మండలాధ్యక్షుడిగా బండి ధర్మరాజు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూరి జయత్రినాథబాబు శనివారం తెలిపారు. త్రినాథబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కార్యదర్శిగా బి.హెచ్.కామేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శిగా ఎ.వీరబాబు ఎంపికయ్యారన్నారు. జిల్లా కౌన్సిలర్లుగా శైలజాభవాని, ఎస్‌జే త్రినాథబాబు, పీవీవీ భీమేశ్వరరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ఎంఎస్ఎస్ ప్రభాకర కుమార్, ఎ.శామ్యూల్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో సామూహిక సత్యవ్రతాలు

సీతానగరం, జనవరి 27: సీతానగరంలోని సాయిమందిరం 25వ వార్షికోత్సవం సందర్భంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సామూహిక సత్యవ్రతాలు నిర్వహించారు. కాకినాడకు చెందిన రఘుపతి మాస్టారు 250 మంది భక్తులతో వ్రతాలు చేయించారు. అనంతరం మాస్టారుకు, గ్రామాల్లోని వివిధ ఆలయాల్లో భజనలు చేసే సంఘాల వారికి సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఉదయం సాయి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో స్టెమీ ప్రోగ్రాం విజయవంతం

పైలెట్ ప్రోగ్రాంగా అనపర్తి ఏరియా ఆసుపత్రి



అనపర్తి, జనవరి 27: తీవ్రమైన గుండె నొప్పితో బాధపడే రోగికి అత్యవసరంగా ఉపయోగించే స్టెమీ ప్రోగ్రాంను అనపర్తి ఏరియా ఆసుపత్రిలో వైద్యులు దిగ్విజయంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా వైద్యులను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడి సత్కరించారు. స్టెమీ ప్రోగ్రాం గురించి ఆయన మాట్లాడుతూ తీవ్ర గుండె నొప్పితో బాధపడే రోగిని అర గంట లోపున ఆసుపత్రికి తీసుకురాగలిగితే త్రుంబోలిసిస్ అనే ప్రక్రియ ద్వారా ప్రాణాలు కాపాడవచ్చన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ఈ కార్యక్రమం నిర్వహించేందుకు అనపర్తి ఏరియా ఆసుపత్రిని ఎంపిక చేశారని చెప్పారు. తీవ్ర గుండె నొప్పి, శ్వాసకోశ ఇబ్బందితో వచ్చిన రాజు(47) రోగికి రూ.40వేల విలువ కలిగిన టెనెక్ట్ ప్లేస్ అనే ఇంజక్షన్ అందించడం ద్వారా అతని ప్రాణాలు కాపాడగలిగామన్నారు. ఈ ప్రక్రియ నిర్వహించిన వైద్యులు చంద్రశేఖర్, డాక్టర్ డేవిడ్ రతన్, డాక్టర్ వాసవిలను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రక్రియ నిర్వహించిన వైద్యులను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కర్రి బాల తదితరులు అభినందించారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఇద్దరి ఎంపిక

బిక్కవోలు, జనవరి 27: నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షల్లో మెళ్లూరు ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చూపి ఎంపికయ్యారని హెచ్ఎం జి. లక్ష్మి శనివారం తెలిపారు. ఎంపికైన వారిలో ఓపిఎస్ వి.చక్రిధర్, డిఎస్ఎస్. సుదర్శిని వున్నారన్నారు. వీరిని సర్పంచ్ పెదిరెడ్డి సాయిరాం, ఉపసర్పంచ్ ఆనంద్, గ్రామ పెద్దలు అభినందించారు.

గోపాల్‌నగర్‌లో అగ్నిప్రమాదం

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గోపాల్‌నగర్ పుంతలోని చెల్లుబోయిన దుర్గాప్రసాద్ ఇంట్లో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు. ప్రాణహాని లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇంట్లోని వాషింగ్ మిషన్, ఫ్రిజ్, బీరువా, మిక్సీ తదితర వస్తువులు కాలి బూడిదయ్యాయి.

నీటి సంఘం అధ్యక్షుడు నరసింహారావు మృతి

కోరుకొండ, జనవరి 27: జంబుపట్నం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, బలరామయ్య చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు నాగా నరసింహారావు (79) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి, సీనియర్ నాయకులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. అలాగే ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జనసేన ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ, జక్కంపూడి గణేష్ తదితరులు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గవర్నర్ తమిళ్‌సైకు డాక్టర్ రామారెడ్డి శుభాకాంక్షలు



గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రాజభవన్‌లో జరిగిన ఎట్ హోం ఫంక్షన్లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళసై సౌందరరాజన్‌కు డాక్టర్ దశరథ రామారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

4న రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 27: రాజమహేంద్రవరంలో వచ్చే నెల 4న బొమ్మన రాజ్‌కుమార్ మెమోరియల్ ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు వ్యాయామ కళాశాల సెక్రటరీ అడ్డూరి వెంకటరమణమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కోటిపల్లి బస్టాండు వద్దనున్న శ్రీ గౌతమి వ్యాయామ కళాశాల ఆవరణలో పోటీలు జరుగుతాయన్నారు. ఏడు విభాగాల్లో బాడీబిల్డింగ్ పోటీలు, రెండు విభాగాల్లో మెన్ ఫిజిక్, ఒక విభాగంలో మాస్టర్స్ పోటీలు నిర్వహిస్తామని మొత్తం 10 విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీల్లో విజేతలైన వారు ఫిబ్రవరి 22, 23 తేదీల్లో కేరళ రాష్ట్రంలోని కాలికట్‌లో నిర్వహించే సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలకు, మార్చి 15, 16, 17 తేదీల్లో తిరుచూర్‌లో జరిగే ఆలిండియా పోటీలకు ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులుగా వెళతారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'ఆంధ్రజ్యోతి'ని సందర్శించిన శ్రీప్రకాష్ విద్యార్థులు



ఆంధ్రజ్యోతి దినపత్రిక కార్యాలయంలో శ్రీప్రకాష్ స్కూల్ విద్యార్థులు

దివాన్‌చెరువు, జనవరి 27: దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ స్కూల్ విద్యార్థులు నాలెడ్జ్ ట్రిప్‌లో బాగంగా శనివారం ఉదయం సుమారు వంద మంది విద్యార్థులు పాలచర్ల గ్రామంలోని ఆంధ్రజ్యోతి దినపత్రిక కార్యాలయాన్ని సందర్శించారు. వారికి ఆంధ్రజ్యోతి సిబ్బంది పత్రిక తయారయ్యే విధానం, ప్రాసెస్, ప్రింటింగ్ వివరించి చూపించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

100 లీటర్ల సారా స్వాధీనం

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అమ్మకానికి సిద్ధం చేసిన 100 లీటర్ల సారా బొమ్మూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బొమ్మూరు సీఐ ఎండీ ఉమర్‌కి వచ్చిన సమాచారంతో హుకుంపేటలోని ఓ ప్రాంతంలో ఎస్ఐ జగన్ తమ సిబ్బందితో సోదాలు చేశారు. రవాణాకు సిద్ధం చేసిన సారా బాటిళ్లను గుర్తించారు. హుకుంపేటకు చెందిన విత్తనాల అప్పల రాజును అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఉమర్, ఎస్ఐ జగన్, సిబ్బందిని ఎస్పీ జగదీశ్ అభినందించారు. నాటుసారా తయారీ, రవాణాపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు.


రంగాపురంలో రాగి వైరు చోరీ

బిక్కవోలు, జనవరి 27: రంగాపురంలోని గుమ్మళ్ల వెంకటసుబ్బారావుకు చెందిన పామాయిల్ తోటలో వున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగివైరును శుక్రవారం అర్ధరాత్రి దుండగులు దొంగిలించారంటూ సుబ్బారావు బిక్కవోలు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. వైరు విలువ రూ.30 వేలు వుంటుందని, దీనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు.



ఎన్ఎంఎంఎస్‌కు 15 మంది ఎంపిక


అనపర్తి, జనవరి 27: ఎన్ఎంఎంఎస్‌కు అనపర్తిలోని బాలికోన్నత పాఠశాలకు చెందిన 15మంది విద్యార్థినులు ఎంపికైనట్టు హెచ్ఎం శనివారం కర్రి కళ్యాణి తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు వచ్చే ఏడాది నుంచి ఐదేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేలు నేరుగా వారి ఖాతాలకు జమవుతాయని చెప్పారు. గణితశాస్త్రంలో అత్యుత్తమ స్టడీ మెటీరియల్ అందిస్తూ ఈ ఎంపికకు కారణమైన ఉపాధ్యాయిని కర్రి దుర్గానళినిని ఉపాధ్యాయినులు అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





రేపు రాజమహేంద్రవరంలో రా కదలిరా

- చంద్రబాబు నాయుడు హాజరు
- కాతేరులో భారీ బహిరంగ సభ
- జిల్లా వ్యాప్తంగా జనం రాక
- 23 ఎకరాల్లో భారీ వేదిక



6



విలేకరులతో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

నేడు యూటీఎఫ్ ఓట్ ఫర్ ఓపీఎస్

రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్ వెల్లడి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 27 : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని ఎవరైతే పునరుద్ధరిస్తారో వారికే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీపీఎస్ రద్దుతో పాటు పాత పెన్షన్ సాధనకు ఆదివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓట్ ఫర్ ఓపీఎస్ సభను నిర్వహిస్తున్నామని వెల్లడించారు.ఈ సభకు అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించామన్నారు.గత ఎన్నికల ముందు జగన్మోహనరెడ్డి సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తామని ప్రకటించి ఉద్యోగులను మోసం చేశారన్నారు. జీపీఎస్‌తో ఎవరికీ ప్రయోజనం లేద న్నారు. సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు అరుణకుమారి, లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జయకర్, షరీఫ్ పాల్గొన్నారు.

పరిశ్రమలకు రూ.29.88 లక్షల రాయితీలు

10వ పారిశ్రామికాభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పారిశ్రామిక రాయితీలకు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి సుమారు రూ.29.88 లక్షల అందజేసినట్టు కలెక్టర్ డా.కె.మాధవీలత తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం జరిగిన 10వ జిల్లా స్థాయి పారిశ్రామిక అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటి వరకూ జిల్లాలో 6748 సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల కింద రూ.1109 కోట్లతో 25,222 మందికి ఉపాధి కల్పించినట్టు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి బి. వేంకటేశ్వరరావు తెలిపారు.116 అనుమతుల ప్రగతిని సమీక్షించామన్నారు. సమావేశంలో ఏపీఐఐసి జోనల్ మేనేజర్ డీవీఎంఎస్ జ్యోత్స్న, ఏపీ పీసీబీ ఈఈ సందీప్‌రెడ్డి, స్టేట్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ కె.కేదారేశ్వరరావు, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జి.స్వాతి పాల్గొన్నారు.



సెంట్రల్ జైలులో జరిగిన రిట్రీట్‌లో మాట్లాడుతున్న డీఐజీ రవికిరణ్

ఘనంగా జైళ్లశాఖ రిట్రీట్

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జైళ్లశాఖ కోస్తాంధ్ర ప్రాంత రిట్రీట్-2024ని రాజమహేంద్రవరం కేంద్ర కారాగార ప్రాంగణంలో డీఐజీ ఎంఆర్ రవికిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఏడాది శాఖలోని పరిణామాలు, సిబ్బంది సంక్షేమం, ఈ ఏడాదిలో చేయాల్సిన కార్యాచరణపై సమీక్షించారు. తూర్పుగోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన జైళ్ల సిబ్బంది పాల్గొన్నారు. లైఫ్ సేవింగ్ స్కిల్స్‌పై డాక్టర్ ఆదిత్య, అగ్నిప్రమాదాల నివారణపై ఫైర్ సిబ్బంది, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, డీఎస్‌లు రాజ్‌కుమార్, బి.రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో తండ్రికి పిల్లలను అప్పగిస్తున్న జీఆర్పీ పోలీసులు

తల్లిదండ్రుల చెంతకు అక్కాచెల్లెళ్లు

తప్పిపోయిన బాలికలను పట్టుకుని అప్పగించిన జీఆర్పీ

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రివేళ రాజమహేంద్రవరం ప్రభుత్వ రైల్వే పోలీసులు(జీఆర్పీ) వేగంగా స్పందించడంతో తప్పిపోయిన ఇద్దరు బాలికలు తల్లిదండ్రుల చెంతకు చేరారు. 26న అర్ధరాత్రి సమయంలో విశాఖ న్యూ పోర్ట్ పోలీసులు ఇక్కడి జీఆర్పీ సీఐ విజయ్ శంకర్‌కి ఫోన్ చేశారు. తమ స్టేషను పరిధిలో 15 ఏళ్ల మనీషాకుమారి, 14 ఏళ్ల కిరణ్ కుమారి అనే అక్కాచెల్లెళ్ల ఆచూకీ తెలియడం లేదని సమాచారం ఇచ్చారు. వాట్సప్‌లో బాలికల ఫొటోలను పంపించారు. విజయ్ శంకర్ రాత్రి గస్తీలో భాగంగా ప్లాట్‌ఫాంపై తనిఖీలు చేస్తూ బాలికల విషయాన్ని డ్యూటీలో ఉన్న ఆర్‌పీఎస్‌ఐ శ్రీహరిబాబు, హెచ్‌సీ సత్యనారాయణ, పీసీలు భాస్కర్, రాంబాబుకు చెప్పి గమనించాలని ఆదేశించారు. వాళ్లు రైళ్లలో పరిశీలిస్తుండగా ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో ఆ బాలికలు తారసపడ్డారు. వారిని పట్టుకుని స్టేషన్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు శనివారం ఉదయం బాలికల తల్లిదండ్రులు వచ్చి తీసుకెళ్లారు.విధుల్లో అప్రమత్తత చూపిన సిబ్బందిని డీఎస్ఆర్‌పీ బీవీఎస్ నాగేశ్వరరావు అభినందించారు.



రాజమహేంద్రవరంలో జాంపేట మార్కెట్

ముక్క.. ముప్పు!

చూసికొనకపోతే అనారోగ్యమే సుమా!

ఈ రోజు ఆదివారం.. తెలవారగానే చేతిలో సంచితో మాంసాహార దుకాణాల వైపు కాళ్లు వడివడిగా అడుగులు పడతాయి..జిహ్వాచాపల్యం జివ్వున లాగుతోంది.. మిగతా రోజుల్లో ఎలా ఉన్నా ఆదివారం మాంచి మసాలా దట్టించి ఏ మేక తలకాయ ఇగురో.. చేపల పులుసో.. పీతల వేపుడో చేసేసుకుని ఎంజాయ్ చేయాలనుకుంటున్నారా? సరే.. కానిచ్చేయండి. కానీ ఒక్కసారి కొనేవాటి నాణ్యత, తాజాదనాన్ని చూసుకోండి. తెలియకపోతే తెలిసిన వాళ్ల సలహా తీసుకోండి. లేకపోతే ఆరోగ్యానికి ఎసరు పెట్టుకున్నట్టే సుమా!. పెద్ద మార్కెట్లకు వెళ్లినప్పుడు మరీ జాగ్రత్తండోయ్! మన ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన శాఖలు ఒకరిపై నెపం నెట్టుకునే జపం వదలడం లేదు మరి! చేపల మొప్పలకు రంగు, కోడి రక్తం పూసేసి అమ్మేసే స్థాయికి ఆహార భద్రత దిగజారి పోయింది. ప్రజారోగ్యం దృష్ట్యా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రజారోగ్యం అంటే యంత్రాంగానికి చులకన అయిపోయినట్లు కనిపిస్తోంది. అబ్బే.. మాది కాందటే మాది కాదంటూ ఒకరిపై ఒకరు నెపం నెట్టేసుకొని చివరికి ప్రజల ప్రజారోగ్యాన్ని పైవాడి దయకు వదిలేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా మాంసాహార మార్కెట్లు రోగాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. పట్టించుకునేవాళ్లు కనుచూపు మేరలో కనబడకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తు న్నారు. తాజా అనే మాటకు ఎప్పుడో స్వస్తి పలికేశారు. మాంసాహారంపై కాస్త అవగాహన ఉంటే పర్లేదు గానీ లేకపోతే కుళ్లిన వాటిని కొనుక్కొని ఇంటికి తీసుకెళ్లి పడేయాల్సిందే. ఒక్కోసారి కూర వండిన తర్వాత ఉసూరు మంటున్నారు.ఒకవైపు ధరలు,కొలతలపై ఎలాంటి నియంత్రణ లేకపోగా వందలాది రూపాయలు వెచ్చించి కొన్నా మంచి సరుకు దొరకడం అదృష్టంగా మారిపోయింది. ఆదివారం అయితే డబ్బులు పెట్టి మరీ రోగాలను కొని తెచ్చుకున్నట్లుగా దుస్థితి దాపురించింది.పాలకులకు ప్రజల ఆరోగ్యం అంటే ఎంత చులకనంటే.. జిల్లాకు ఒకరే ఆహార భద్రతా అధికారి ఉన్నారు.ఆయనకు తనిఖీలకు వెళ్లడానికి ఎలాంటి సదుపాయాలూ లేవు.ప్రజలకు ఎవరికి ఫిర్యాదు చేయాలో ఎవరూ అవగాహన లేదు.

ఆహార నియంత్రణ ఏదీ?

మునిసిపల్/పంచాయతీ కబేళాలో మేకలు, గొర్రెలను కోసిన తర్వాత ప్రజారోగ్యానికి ఇబ్బంది లేదని వెటర్నరీ వైద్యుడు ధ్రువీకరించిన తర్వాతే విక్రయాలు జరపాలి. కానీ వందలో పదిశాతం కూడా ఆ విధానం కానరాదు. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో వ్యాపారులు ఇష్టారాజ్యం చేస్తున్నారు.ఇక జిల్లా ఆహార భద్రత శాఖలో ఒకే అధికారి ఉన్నారు. ఆయనే జిల్లా అంతా తిరుగుతూ తనిఖీలు చేస్తుండాలి.దీంతో ఆహార భద్రతను అభద్రత వెంటాడుతోంది.ఆయనకు ఎలాంటి వాహనం కూడా ప్రభుత్వం తరపు నుంచి లేకపోవడం గమనార్హం. ఇక వెటర్నరీ,మునిసిపాలిటీ, విజిలెన్స్, తూనికలు కొలతల అధికారులు మార్కెట్లవైపు ఎందుకనో కన్నెత్తి చూడడం లేదు.మార్కెట్ నుంచి బయటకు వచ్చేంత వరకూ



నిల్వ మాంసం

ముక్కు మూసుకోవాల్సిందే.ఇంత దారుణంగా పరి స్థితులున్నా కనీసం ఎవరికి ఫిర్యాదు చేయాలో కూడా అధికారుల నెంబర్లతో కూడిన బోర్డులు ఎక్కడా కనబడవు.

హైదరాబాద్ టు జాంపేట

జిల్లాలోకి ముఖ్యంగా జాంపేట తదితర మాంసాహార మార్కెట్లకు హైదరాబాద్ నుంచి శుక్రవారం రాత్రి సమయంలో నిల్వ ఉన్న మేక, గొర్రె తలకాయలు, కాళ్లు, లివర్ వంటి శాల్తీలు ఐస్‌బాక్సుల్లో పెట్టి వ్యానులో తీసుకొచ్చి దిగుమతి చేస్తున్నారని సమాచారం. శనివారం పెద్దగా బేరాలు ఉండవు కాబట్టి వాటిని అలాగే ఐస్‌బాక్సుల్లో నిల్వ ఉంచి ఆదివారం సందట్లో సడేమియాలో అమ్మేస్తున్నారు. కాస్త తక్కువ ధరకు రావడంతో కొనుగోలుదారులు ఎగబడుతున్నారు.దీంతో ఒక్కోసారి ప్రజారోగ్యంపైనా ప్రభావం పడుతోంది.

ఆదివారం అయితే..

ఆదివారం మాంసాహార ప్రియులు చేపలు, రొయ్యలు, పీతలు, మేక, తలకాయమాంసం, కోడి మాంసం తదితర మాంసాహారం కొనుగోలులో బిజీగా ఉంటారు. మార్కెట్లలోని వ్యాపారులు ఇష్టానుసారం నిల్వ ఉంచిన సరుకును యథేచ్ఛగా విక్రయించేస్తున్నారు. ఉదాహరణకు జిల్లాలోనే పెద్ద మాంసాహార మార్కెట్‌గా చెప్పుకొనే రాజమహేంద్రవరం జాంపేట మార్కెట్‌లో పరిస్థితి దారుణంగా ఉంటుంది. బాగా నిల్వ ఉండి, వాసన వస్తున్నా.. ఈగలు విపరీతంగా ముసురుకుంటున్నా అమ్మకాలు సాగించేస్తారు. తెలంగాణలోని హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి మేక తలకాయలు, కాళ్లు, శాల్తీలు వంటివి ఐసు బాక్సుల్లో పెట్టి సర ఫరా చేస్తున్నారు.వాటిలో పాడైపోయినవి ఉంటాయి. వీటన్నింటినీ కాస్త తక్కువ ధరకు అమ్మేస్తుం టా రు. అందుకే జాంపేట మార్కెట్‌లో చాలా తక్కువ ధర ఉంటుందని పట్టణవాసులు చెబుతుంటారు. కలిసి వస్తుందని ఆశ పడి కొనుగోలు చేస్తున్న కొంత మంది వినియోగదారులు మోసపోతున్నారు. అలా కొనుగోలు చేసిన చాలా మంది రోగాల బారిన పడుతున్నారు. మార్కెట్లలోనే జంతువులను వధించి అమ్మేస్తున్నారు. చేపలు, రొయ్యలు,పీతలు పాడైపోయినవి, కొద్దిసేపట్లో పాడవుతాయనుకున్న వాటినీ అంటగట్టేస్తున్నారు. రోగాలను సరఫరా చేయడానికి ఈగలు ముసురుకుంటున్నాయి.ఒక వైపు సరుకు నాణ్యత అలా ఉంటే.. తూనిక లోనూ మోసాలతో వినియోగదారుల జేబుకు పెద్ద చిల్లే పడుతోంది. తూనికలు కొలతల సిబ్బంది కొరత ఉండడం ప్రజలకు శాపంగా మారింది. ఎలక్ట్రానిక్ కాటాలు ట్యాంపరింగ్ చేసేస్తున్నారు. తూకం రాళ్లు ఎప్పటివో తూనికలు కొలతల శాఖకే తెలియాలి. ఇక జాంపేట చికెన్ మార్కెట్ జిల్లాలోనే పెద్దది. ఇక్కడ శుభ్రత ఉండకపోగా ఎవరి ధరలు వారివే. కనీసం తనిఖీలు లేక ప్రజారోగ్యంతో వ్యాపారులు ఆడుకుంటున్నారు.

- మార్కెట్లకు చేరుతున్న నిల్వ మాంసం
- యథేచ్ఛగా సాగుతున్న విక్రయాలు
- తెలంగాణ నుంచి రాక
- ఆదివారమే భారీగా అమ్మకాలు
- ఎగబడుతున్న కొనుగోలుదారులు
- కన్నెత్తి చూడని అధికారులు
- నిద్దరోతున్న ఫుడ్ సేఫ్టీ
- ఆసుపత్రి బెడ్‌పై ప్రజారోగ్యం

అసలైతే ఇలా చేయాలి

జంతువులను ముందు రోజున వైద్యుడి ముందు (యాంటే మార్టమ్) ప్రవేశపెట్టాలి. సాయంత్రం 5 గంటల నుంచి నీరు, ఆహారం ఇవ్వకుండా ఉపవాసం ఉంచాలి. ఆయన ధ్రువీకరించిన వాటినే తరువాత రోజున వధించాలి. కోసిన తర్వాత మాంసం పరీక్షించి మళ్లీ ధ్రువీకరిస్తారు.జంతువుల భాగాల్లో ఇన్‌ఫెక్షన్/కంతుల వంటివి ఉంటే వాటిని తొలగిస్తారు. మాంసాన్ని కడిగి, కట్ చేసినప్పుడు మనుషుల స్వేద గ్రంథుల ద్వారా కూడా కొన్ని వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. నిల్వ మాంసం ఉంటే బద్దెపురుగులు, క్షయ, హైడాటిడోసిస్, ఆంత్రాక్స్ వంటి రోగాల బారినా పడే ప్రమాదం ఉంది.

ఎవరికి వారు జాగ్రత్త పడాల్సిందే..

వ్యవస్థలు నిద్రాణస్థితిలో ఉన్నప్పుడు ఎవరి జాగ్రత్త వారు తీసుకోవడం తప్పదు. అందువల్ల కొనుగోలు చేసేప్పుడు కాస్త జాగ్రత్తలు తీసుకుంటే కొంత వరకూ అనారోగ్యం నుంచి తప్పించుకోవచ్చు.మాంసాహారం దుర్వాసన వస్తే వండడానికి పనిచేయదని తెలుసుకోవాలి. అలాంటి వాటిని తినడం ప్రాణాంతకం. సముద్రం ఉత్పత్తులు సాధారణంగా నిల్వ చేసినవే ఉంటాయి. కానీ ఎక్కువ రోజులు నిల్వ ఉన్నవి తాజాగా ఉండవు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే కొనకపోవడమే మంచిది.

అధికారుల మొద్దు నిద్ర...

జిల్లాలో రాజమహేంద్రవరం కార్పొరేషన్, నిడదవోలు, కొవ్వూరు మునిసిపాలిటీలు ఉన్నాయి. జంతువుల వధ, మాంసాహారం తనిఖీల బాధ్యత ప్రధానంగా స్థానిక సంస్థలపై ఉంటుంది.కానీ అవి పట్టించుకున్నట్లు కానరావడం లేదు. సుమారు ఐదు లక్షల మంది జనాభా పరిధి ఉన్న రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్‌లో ఒక్క మీట్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ కూడా లేరు. మార్కెట్లను తనిఖీలు చేస్తున్నారా? అంటే అదీ అనుమానమే.రాజమహేంద్రవరం కబేళాలో ఆదివారమైతే సుమారు 900 వరకూ.. జిల్లాలో అయితే దాదాపు 2వేల వరకూ మేకలు, గొర్రెలు తదితర జంతువులను వధిస్తారు. మునిసిపల్ కార్పొరేషన్ అధికారి లేకపోవడంతో పశుసంవర్ధక శాఖ నుంచి డాక్టర్ స్లాటర్ హౌస్‌కి వెళ్తున్నారు.

ఇలా చెక్ చేసుకోండి...

- **చేపలు:** సాధారణంగా చెరువు, సముద్రం చేపలు విక్రయాలు ఎక్కువగా చేస్తుంటారు. గోదావరి చేపలు పెద్దవి దొరకడం చాలా అరుదు. జెల్లలు, వాలుగులు, ఇసుక దొందులు, పరిగలు వంటి గోదావరి ఉత్పత్తులు మాత్రమే లభ్యమవుతున్నాయి. మోసు, బొచ్చె, రాగండి వంటి చెరువు రకాలు ఎక్కువగా అమ్ముతుంటారు. జాంపేట మార్కెట్లో మొప్పలకు కోడి రక్తం పూసేసి మరీ మోసం చేస్తుంటారు. అందువల్ల చేపలను జాగ్రత్తగా చూసుకొని కొనాలి.చేపలు మెత్తగా ఉండకూడదు. మొప్పలు ఎర్రగా ఉండాలి. కళ్లు తెల్లబారి ఉండకూడదు. ముఖ్యంగా దుర్వాసన రాకూడదు. చిన్న చేపలు త్వరగా పాడవుతుంటాయి.కొరమేను బతికి ఉన్నదే కొనాలి.
- **రొయ్యలు:** మెత్తగా ఉండకూడదు. తలలు వాటికవే ఊడిపోతుంటే నిల్వ సరుకని అర్థం. రొయ్య పైపొట్టు మెత్తగా ఉండకూడదు. చెరువు రొయ్యల్లో కొన్ని రకాల్లో పైభాగంలో చిన్న నరంలా నల్లగా కనబడుతుంది. దానిని తీసేయాలి.రొయ్య వ్యర్థాలు ఆ నరంలో ఉంటాయి. గోదావరి రొయ్యలంటూ చెరువు రొయ్యలు అమ్ముతుంటారు. జిల్లాలో అక్కడక్కడా వ్యాన్లు పెట్టి నిల్వ ఉన్న రొయ్యలనే కిలో రూ.100 రూ.150లకు విక్రయిస్తుంటారు.
- **పీతలు:** పీతలు బరువుగా ఉండాలి. నీరుగారిపోయినట్లు తేలిగ్గా ఉంటే పాడవడానికి దగ్గరపడిందని అర్థం చేసుకోవాలి. పీతలు బాగు చేయించిన తర్వాత ఎక్కువ సేపు బయట ఉంచకూడదు. ఫ్రిజ్‌లో పెట్టుకో వాలి. పీతల కాళ్లు, డెక్కలు సులభంగా విరిగిపోతే కాస్త నిల్వ సరుకని తెలుసుకోవాలి.
- **తలకాయ మాంసం:** తలకాయ మాంసంలో రెండు రకాలు.. మేక, గొర్రె తలకాయలను అమ్ముతుంటారు. తాజాగా లేని తలకాయలు, కాళ్లు తక్కువ ధరకు వచ్చేస్తున్నాయని అస్సలు కొనరాదు. నిల్వ చేసినవి, ఐస్‌లో పెట్టినవి ఉంటాయి. జాగ్రత్తగా చూసుకోవాలి. తలకాయ పైచర్మం అక్కడక్కడా ఊడిపోయి ఉంటే నిల్వ చేసినదని అర్థం చేసుకోవాలి. ఇక మేక మాంసం అయితే గొర్రెది అమ్ముతారు. ఎందుకంటే గొర్రె మాంసం కాస్త తక్కువ ధర ఉంటుంది. మేక మాంసం అమ్మకాలు తక్కువగా ఉంటాయి. దీంతో చాలా వరకూ నిల్వ మాంసమే విక్రయిస్తారు. అయినా ఎవరూ పట్టించుకోరు.
- **చికెన్:** ప్రస్తుతం చికెన్ అమ్మకాలు ఎక్కువగా ఉంటున్నాయి.. బ్రాయిలర్ కోళ్లు ప్రతి రోజూ ఒకటో రెండో చచ్చిపోతూనే ఉంటాయి. పారంలో అయితే వీటి సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. ఆయా కోళ్లను సేకరించి విక్రయించేవారు ఉన్నారు. అసలు బ్రాయిలర్ చికెన్ తినకూడదనేది పెద్దల మాట.. అయినా తినేస్తున్నాం.. బతికిన కోడి చికెన్ తింటే బెటర్.

నిల్వ మాంసం తినకూడదు..



నిల్వ మాంసాహారాన్ని తినకూడదు. మాంసం తనిఖీ చేయించారా లేదా అనేది ప్రశ్నించి.. అధికారులు వేసే సీలును గమనించాలి. గర్భంతో ఉన్నా, ప్రత్యుత్పత్తికి ఉపయోగపడే, జ్వరంతో బాధపడే, చనిపోయిన పశువులను వధించి విక్రయించరాదు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమిత వ్యాధులు(జూనోటిక్ డిసీజెస్) రాకుండా నివారించవచ్చు. **- డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవింద్, జిల్లా పశుసంవర్ధక అధికారి**

మార్కెట్లను తనిఖీ చేస్తాం



మాంసాహార మార్కెట్లను ముఖ్యంగా వెటర్నరీ వాళ్లు పరిశీలించాలి. కానీ మేం కూడా చూస్తాం. ఫిర్యాదులు వస్తే తనిఖీలు చేస్తాం. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే జరిమానాలు విధించడంతో పాటు కేసులు పెడతాం. **- వి.రుక్కయ్య, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి**



చూడండి సార్ : పశువుల కొమ్ములు, కాళ్లు, ఎముకలతో నిండి ఉన్న పోలవరం కాల్వగట్టు



ఏర్పాటు చేసుకున్న అనధికార కబేళా

'బలి' పశువులు!

దేవరపల్లి అనధికార కబేళాలో మూగజీవాల కోత

మండల పరిషత్ కార్యాలయాల చెంతనే ఉన్నా కన్నెత్తి చూడని అధికారులు

దేవరపల్లి, జనవరి 27 : అసలు అధికారులు ఉన్నారో లేదో తెలియడం లేదు.. తమ చెంతనే మూగజీవాలను బలి తీసుకుంటున్నా కనీసం ప్రశ్నించడం లేదు.. పట్టుకోవడంలేదు.. కంపుకొడుతున్నా ఏమిటా అది అని అటు వైపు కనీసం కన్నెత్తి చూడడం లేదు.. దీంతో మూగజీవాలను యథేచ్ఛగా బలి తీసుకుంటున్నారు.దేవరపల్లి గ్రామం శివారు పోలవరం కుడి కాల్వ సమీపంలో మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయం, డిగ్రీ కళాశాల ఉన్నాయి. పోలవరం కాల్వ వద్ద చిట్టి అడవిగా ఏర్పడడంతో ఇక్కడ కొందరూ జంతువధ చేయడానికి స్థావరం ఏర్పాటు చేసుకున్నారు.జిల్లాలో ఎక్కడెక్కడి నుంచో పశువులను తీసుకొచ్చి అర్ధరాత్రులు పశువధ చేసి వ్యర్థాలను, ఎములకను ఎన్నో ఏళ్ళుగా ఇక్కడ పడేస్తున్నారు. దీంతో ఎముకల వ్యర్థాలు గుట్టలుగా ఏర్పడి వీటి నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో చుట్టు పక్కల కిలోమీటర్ల పొడవునా దుర్గంధం వ్యాపించి పల్లంట్ల, ఏలూరు రహదారి గుండా వెళ్ళే ప్రజల ముక్కుపుటాలను తాకుతోంది. అయినా స్థానిక అధికారుల్లో మాత్రం కనీస కదలిక లేదు..దేవరపల్లి వాసులు మాత్రం నిత్యం దుర్వాసనతో ముక్కుతిప్పలు పడుతున్నారు. ఈ సమస్యపై ఎన్నో సార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉండలేకపోతున్నాం..



దేవరపల్లి గ్రామంలో ఉండలేకపోతున్నాం. పశువుల వ్యర్థాల దుర్గంధంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. పశువుల వ్యర్థాలను తొలగించి పశువధ చేయకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కోరాం.. ఎన్నోసార్లు పంచాయతీ, రెవిన్యూ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. **- డాక్టర్ కాశీవిశ్వనాథం, దేవరపల్లి**

నేడు రాజమండ్రిలో ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఆదివారం చెరుకూరి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు.స్థానిక చెరుకూరి కల్యాణ మండపంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ఉదయం 11గంటల నుంచి నూతన రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక ప్రక్రియ ఆరంభమవుతుందన్నారు. ఒక్కో నామినేషన్ వస్తే కార్యకవర్గ ఎన్నిక పూర్తవుతుందని,ఎక్కువ నామినేషన్లు వస్తే వచ్చేనెల 14న విజయవాడలోని ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో పోలింగ్ నిర్వహిస్తా మన్నారు. సభకు సుమారు 2500 మంది ప్రతినిధులు హాజర వుతారన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కంచర్ల బాబి, ప్రతినిధులు కృష్ణమోహన్, నాళంరోశయ్య, శ్రీఘాకోళ్లపు సీతారామాం జనేయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పద్మభూషణ్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి

స్మోకింగ్, డ్రింకింగే లివర్ వ్యాధులకు మూలం

గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యనిపుణుడు డాక్టర్ నాగేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 27 : దేశంలో లివర్ వ్యాధుల చికిత్సలో అత్యాధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని, రాబోయే పదేళ్లలో ఈ రంగంలో అమెరికాతో సమానంగా ఎదుగుతామని గ్యాస్ట్రో ఎంటరాలజీ సూపర్‌స్పెషాలిటీ వైద్యనిపుణుడు, పద్మభూషణ్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి (ఏఐజీఈ, హైదరాబాద్) అన్నారు. రాజమహేంద్రవరంలో గ్యాస్ట్రో ఎంటరాలజీ సొసైటీ, ఇండియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరగనున్న 6వ వార్షిక రాష్ట్ర స్థాయి సదస్సుకు తొలిరోజు శనివారం హాజరై మాట్లాడారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, వ్యాయామం, స్మోకింగ్, డ్రింకింగ్‌లను మానుకోవడం ద్వారా చాలా వరకూ లివర్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. బెంగుళూరుకు చెందిన డాక్టర్ నరేష్‌భట్, చెన్నయ్‌కు చెందిన డాక్టర్ టీఎస్ చంద్రశేఖర్ ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం గ్యాస్ట్రో సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అగస్త్యరాజు శ్రీనివాసరావు, సెక్రటరీ డాక్టర్ వి.శ్రీరాములు, కోశాధికారి డాక్టర్ ఉమాకాంత్, ఉపాధ్యక్షులు డాక్టర్ వరుణ్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ స్వాప్నిక, డాక్టర్ కవిత పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఓటర్ల జాబితాలో తప్పులుంటే సరిచేయాలి

కొవ్వూరు సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు, జనవరి 27: తుది ఓటర్ల జాబితాలో తప్పులుంటే రెండు రోజుల్లోగా సరిచేయాలని సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రకటించిన తుది ఓటర్ల జాబితాను పరిశీలించి తప్పొప్పులు ఉంటే ఈ నెల 29వ తేదీలోగా సరిచేయాలన్నారు. జాబితాలో పేర్లు, ఫొటోలు, చిరునామా తప్పులు పడితే ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు చేపట్టాలన్నారు. డూప్లికేట్స్ ఓట్లు ఉన్నా, ఒకే డోర్ నంబరులో 10కి మించిన ఓటర్లు ఉంటే రేషన్‌కార్డు వారీగా విడదీయాలని, చనిపోయిన ఓటర్లుంటే మరణ ధ్రువీకరణ పత్రం లేదా సరైన ఆధారాలతో పంచనామా చేసి తొలగించాలన్నారు. పూర్తిగా గ్రామాంతరం వెళ్లిపోయిన వారి వివరాలు సేకరించి, వారికి నోటీసులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏడుగురు ఏఈఆర్‌వోలు, 17 మంది సూపర్‌వైజర్లు, 176 మంది బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఇద్దరి ఎంపిక

కొవ్వూరు, జనవరి 27: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు పంగిడి జడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి బట్టు ధర్మతేజ ఎంపికయినట్టు హెచ్‌ఎం మంగిన శ్రీరామారావు తెలిపారు. శనివారం పాఠశాలలో ధర్మతేజకు అభినందన సభ నిర్వహించారు. ఇంటర్ వరకు ప్రతి ఏడాది ధర్మతేజు బ్యాంకు ఖాతాకు కేంద్ర ప్రభుత్వం రూ.12,000 జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగ మండలంలోని వాడపల్లి జడ్పీ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న మంగరాయి దుర్గయ్య ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయినట్టు హెచ్‌ఎం బి.యుగంధర్‌కుమార్ తెలిపారు. దుర్గయ్యను ఎంపీపీ కాకర్ల నారాయుడు, విద్యా కమిటీ చైర్మన్ సరోజిని అభినందిచారన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

కొవ్వూరు, జనవరి 27: మహిళలందరూ చట్టాలపై అవగాహన కలిగి వుండాలని కొవ్వూరు ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి అన్నారు. శనివారం కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో గ్రామ, వార్డు మహిళా పోలీసులతో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ చట్టాలపై అవగాహన పెంచుకుంటే సమాజంలో మహిళలపై జరిగే అన్యాయాలను ఎదురించగలమన్నారు. విడాకులు, పోక్సో, మహిళా చట్టాలను ఆమె వివరించారు.

ఏబీఎన్ కళాశాలలో ఉన్నత్ భారత్ అభియాన్

కొవ్వూరు, జనవరి 27: ఉన్నత్ భారత్ అభియాన్ విద్యా సంస్థలు, విద్యార్థుల సహకారంతో గ్రామాభివృద్ధికి తోడ్పడుతుందని ఉన్నత్ భారత్ అబియాన్ రీజనల్ కోఆర్డినేటర్ పావని భీశెట్టి అన్నారు. కొవ్వూరు ఏబీఎన్, పీఆర్‌ఆర్ డిగ్రీ, పిజీ కళాశాలలో శనివారం ఉన్నత్ భారత్ అభియాన్ ప్రారంభించారు. విద్యార్థులకు సబ్జెక్టు ఎక్స్‌పర్ట్ గ్రూపుపై సదస్సు నిర్వహించారు. పావని మాట్లాడుతూ విద్యా సంస్థల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థుల భాగస్వామ్యంతో ఒక కళాశాల 5 గ్రామాలను దత్తత తీసుకుని, ఆ గ్రామాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఉన్నత్ భారత్ అభియాన్‌కు నివేదిక సమర్పిస్తే నిధులు విడుదల చేసి గ్రామాభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు. కాగా ఏబీఎన్ కళాశాల అరికిరేవుల, కుమారదేవం, నందమూరు, పశివేదల, దొమ్మేరు గ్రామాలను దత్తత తీసుకున్నట్టు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.రమేష్ చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ వి.శ్రీనివాస్, దేవరపల్లి బీహెచ్‌ఎస్‌ఆర్ కోఆర్డినేటర్ పోలుమాటి రాజు, గోపాలపురం కొండవీటి కళాశాల కోఆర్డినేటర్ బీవీ కుమార్, సంస్కృత కళాశాల కోఆర్డినేటర్ గీతాదేవి పాల్గొన్నారు.

తాళ్లపూడిలో ఎలక్ట్రీషియన్స్ డే



తాళ్లపూడిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎలక్ట్రీషియన్లు

తాళ్లపూడి, జనవరి 27: ఎలక్ట్రీషియన్స్ డేను తాళ్లపూడిలో శనివారం ఘనంగా నిర్వహించారు. థామస్ అల్వా ఎడిసన్ బల్బ్‌ను జనవరి 27న ఆవిష్కరించారని, ఆ రోజును ఎలక్ట్రీషియన్ డేగా జరుపుకుంటున్నామని ఎలక్ట్రీషియన్లు తెలిపారు. మండల సంఘం వార్షికోత్సం సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఎలుబోలు శ్రీనివాస్ సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని ఎలక్ట్రీయషన్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీభాయి, అల్లూరి విగ్రహాల ఆవిష్కరణ

తాళ్లపూడి, జనవరి 27: మండలంలోని వేగేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఝాన్సీ లక్ష్మీభాయి, అల్లూరి సీతారామరాజు విగ్రహాలను ఆవిష్కరించారు. సర్పంచ్ కేపీ రామారావు సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లపూడి ఎస్‌ఐగా శ్యాంసుందర్



తాళ్లపూడి, జనవరి 27: తాళ్లపూడి ఎస్‌ఐగా టి.శ్యాంసుందర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా రాజమహేంద్రవరం త్రీటౌన్ స్టేషన్ నుంచి తాళ్లపూడి వచ్చినట్టు ఆయన చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కాగా ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ కె.వెంకటరమణ విజయవాడ కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లారు.

పాత పెన్షన్ విధానం కొనసాగించాలి

చాగల్లు, జనవరి 27: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ చాగల్లు జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులు శనివారం నిరసన తెలిపారు. ఆదివారం రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాలలో రాష్ట్రస్థాయిలో పెన్షన్ సాధన సభ జరుగుతుందని, యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధ్యాయులంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాసమూర్తి, టి.సత్తిరాజు, గంగాధర్, ఆర్‌వీ ప్రసాద్, కె.నరసింహాచార్యులు, తన్వీర్ అహ్మద్ పాల్గొన్నారు.

జిలాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



జిల్లాస్థాయి వాలీబాల్ మహిళల జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు

చాగల్లు, జనవరి 27: ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో జరిగిన వాలీబాల్ మహిళ పోటీల్లో మండలంలోని మార్కొండపాడు మహిళల జట్టు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా మార్కొండపాడు హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో విజేతలను ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు. కార్యక్రమంలో పోటీల కోఆర్డినేటర్ నాగరాజు, సీహెచ్ సతీష్, లెనిన్‌బాబు పాల్గొన్నారు.

ఎన్‌వైకేఎస్ జిల్లా సభ్యుడిగా సాయికుమార్



నిడదవోలు, జనవరి 27: నిడదవోలుకు చెందిన బీజేపీ యువ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు మోర్త బాలవినోద్ సాయికుమార్‌ను జిల్లా నెహ్రూ యువ కేంద్ర సంఘటన సభ్యుడిగా నియమిస్తూ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ నితీష్‌కుమార్ మిశ్రా నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా సాయికుమార్‌ను పట్టణానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

ఇంటర్ పరీక్షల ఫీజుకు రేపు చివరి తేదీ

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాల వల్ల ఇప్పటి వరకూ ఇంటర్మీడియట్ పరీక్షలు-2024 నిమిత్తం ఫీజు చెల్లించని వారు తత్కాల్ స్కీం కింద అపరాధ రుసుం రూ.3వేలతో ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5గంటలలోపు చెల్లించాలని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్‌ఎస్‌వీఎల్ నరసింహం సూచించారు. జనరల్, ఒకేషనల్ విభాగాల్లోని రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు చెల్లించిన ఫీజును ఆన్‌లైన్ పేమెంటుతో బోర్డుకు ప్రిన్సిపాల్స్ జమ చేయవచ్చన్నారు.

బిల్లులు రావడం లేదు

- మునిసిపల్ కమిషనర్ హామీ ఇస్తారా?
- అధికార పార్టీ కౌన్సిలర్ల ఆవేదన
- కొవ్వూరు కౌన్సిల్ సాధారణ, అత్యవసర, బడ్జెట్ సమావేశం

కొవ్వూరు, జనవరి 27: చేసిన పనులకు బిల్లుల రావడం లేదని, బిల్లులకు కమిషనర్ హామీ ఇస్తారా అని అధికార పార్టీ కౌన్సిలర్లు కోడూరి శివరామకృష్ణ, కంఠమణి రమేష్‌బాబు, బత్తి నాగరాజు, అంకోల్లు లిల్లీ ప్రశ్నించారు. కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఆన్‌లైన్ లాగిన్‌లో బిల్లులు అప్‌లోడ్ చేయడం వరకే తమ బాధ్యత అని బదులిచ్చారు. కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలతో పాటు బడ్జెట్ సమావేశం చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. టీడీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ అధికార వైసీపీ ఆర్భాటం తప్ప అభివృద్ధి లేదన్నారు. గడప గడపకు కార్యక్రమంలో భాగంగా మున్సిపాల్టీలో గుర్తించి సుమారు రూ.4 కోట్లతో చేపట్టిన పనులు చేయలేక కాంట్రాక్టర్లు చేతులు ఎత్తేస్తున్నారని, మరో నెలలో ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం వుంది ఆ పనులు ఎప్పుడు పూర్తిచేస్తారని ప్రశ్నించారు. బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ పట్టణంలో చేపడుతున్న పనులకు సంబంధించి 20శాతానికి పైబడి కాంట్రాక్టర్లు టెండరు ఎస్టిమేట్ కంటే తక్కువకు వేస్తున్నారు. దీంతో నాణ్యత దెబ్బతింటుందని అసహనాన్ని వ్యక్తం చేశారు. చిన్ని మాట్లాడుతూ కౌన్సిల్ తీర్మాణం లేకుండా మున్సిపాలిటీ సాధారణ నిధులతో పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్ వేసే కాంట్రాక్టర్‌ని సీడీఎంఏ ఎలా ఎంపిక చేస్తుందన్నారు. జీరో అవర్‌లో ప్రశ్నించిన అంశాలు, సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని, అధికార, ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. కంఠమణి రమేష్‌బాబు మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున ఫిబ్రవరి నెల సాధారణ సమావేశం 15వ తేదీలోగా జరపాలని కోరారు. పాలూరి నీలిమ మాట్లాడుతూ 7వ వార్డులో వలంటీర్లు 2వ సచివాలయంలోని తమ బంధువులను వారు పనిచేసే ప్రాంతంలో మ్యాపింగ్ చేసుకుని వారికి లబ్ధి చేకూర్చుతున్నారని, వారిపై చర్యలు తీసకోవాలన్నారు. చీర అరుణ మాట్లాడుతూ 14వ వార్డుకు పైపులైను మరమ్మతులకు గురై తాగు నీరు కలుషితమై ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు.



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, చైరపర్సన్ రత్నకుమారి

రూ.1,33,40,000తో బడ్జెట్ ఆమోదం

కొవ్వూరు పురపాలక సంఘం 2024- 25 సంవత్సరానికి రూ.1,33,40,000 ముగింపు నిల్వతో కూడిన బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించింది. మూలధనం, 2023-24లో సవరించిన బడ్జెట్ అంచనాలను ముగింపు నిల్వను రూ.27,03,75,626ను 2024-25 సంవత్సరానికి ప్రారంభ నిల్వగా చూపించారు. మూలధన ఆదాయం రూ.16.97 కోట్లు, ఖర్చులుగా రూ.18.56 కోట్లు, చూపించగా రూ.1,07,80,000ను 2024-25కు ముగింపు నిల్వగా, శాసనాత్మక నిల్వగా 5శాతం రూ.46,20,000లుగా చూపించారు. చిన్ని మాట్లాడుతూ 2023-24లో కొవ్వూరు మున్సిపాల్టీకి ఎస్సీ సబ్‌ప్లాన్, ఎంపీ గ్రాంటు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ఎస్ఎఫ్‌సీ నిధులు ప్రభుత్వం నుంచి అధికార పార్టీ తీసుకురాలేకపోయిందని, గత ఏడాది బడ్జెట్‌లో రాని నిధులు ఈ ఏడాది వస్తాయని ముందుగా ఊహించి, బడ్జెట్‌లో అంకెల గారడి చేస్తున్నారా అని అధికారులను నిలదీశారు.

రేపు తెలుగుదేశం పిలుస్తోంది

రా..కదలిరా

- రాజమహేంద్రవరం రూరల్ కాతేరులో బహిరంగ సభ
- 23 ఎకరాల్లో వేదిక ఏర్పాట్లు.. చంద్రబాబు నాయుడు హాజరు
- ఏర్పాట్లకు యనమల, రాజప్ప, గోరంట్ల భూమి పూజ



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న యనమల, చినరాజప్ప, గోరంట్ల తదితరులు

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని కాతేరులో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఈ సభ ఏర్పాట్లను శనివారం ఉదయం 9.30 గంటలకు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చిన రాజప్ప, జోన్- 2 కోఆర్డినేటర్ రవి, జనసేన రాజానగరం ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నేతలు యర్రా వేణుగోపాల్‌రాయుడు, కోనేరు నవీన్ తదితరులు భూమి పూజ చేశారు. వేద మంత్రాల మధ్య రాట పాతి పనులు ప్రారంభించారు.అనంతరం ప్రియాంక గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో యనమల రామకృష్ణుడు మాట్లా డుతూ ప్రతిష్ఠాత్మకంగా జరనున్న ఈ సభకు జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల నుంచి అత్యధికంగా క్యాడర్ తరలి రావాలన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ 23ఎకరాల్లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హెలీప్యాడ్, పార్కింగ్ ఏర్పాట్లు, భోజన ఏర్పాట్లు కూడా చేస్తున్నట్టు చెప్పారు. చంద్రబాబు సభకు పార్టీ కార్యకర్తలు, నేతలు, జనసైనికులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మె ల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపు ఇచ్చారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ రూరల్ నుంచి అన్నివర్గాల ప్రజలు వచ్చేలా ప్రచారం చేయాలన్నారు. కనీవినీ ఎరుగని రీతిలో ఈ సభ జరగనున్నదని, ఏర్పాట్లు చూసి వైసీపీ నేతల గుండెల్లో రైళ్ల పరిగెడుతున్నాయన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, అంగర రామ్మోహనరావు, చిల్లా జగదీశ్వరి, పెచ్చెట్టి చంద్రమౌళి, డొక్కా నాథ్‌బాబు, యర్రా వేణుగోపాలరాయుడు, వాసిరెడ్డి రాంబాబు, చెల్లుబోయిన శ్రీనివాస్, మజ్జి పద్మావతి, గంగిన హనుమంతరావు, మార్ని వాస్‌దేవ్, పండూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రా.. కదలిరా సభ విజయవంతం చేయాలి

కొవ్వూరు, జనసేన 27: టీడీపీ అధినేత చంద్రబాబు రా.. కదలిరా సభను విజయవంతం చేయాలని ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి అన్నారు. కొవ్వూరు లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో శనివారం జరిగిన టీడీపీ, జనసేన నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 29న కాతేరులోని తిరుమల స్కూల్ పక్కన ఉదయం 10గంటలకు జరగనున్న సభకు అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు వెళ్లాలని, సోమవారం ఉదయం 9గంటలకు కొవ్వూరు గామన్‌బ్రిడ్జి వద్ద నుంచి బస్సులు బలుదేరుతాయన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుం చి 100 మందికి తగ్గకుండా వెళ్లాలన్నారు. కార్యక్రమంలో రా కదలిరా కార్యక్రమ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు, గొర్రెల శ్రీధర్, రుద్రరాజు వెంకటరామరాజు, మద్దిపట్ల శివరామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, నామాన పరమేష్, సూరపనేని చిన్ని, జనసేన నాయకులు దేగల రాము, సుంకర సత్తిబాబు, అన్నాజి రామాంజనేయులు, కె.నవ్య, ఎరుబండి సురేష్, ఎం.నాగరాజు పాల్గొన్నారు.



కొవ్వూరు సమావేశంలో పాల్గొన్న టీడీపీ, జనసేన నాయకులు

రేపు చంద్రబాబు పర్యటన సాగుతుందిలా..

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఈనెల 29న టీడీపీ అధినేత చంద్రబాబు రాజమహేంద్రవరం రానున్నారు. కాతేరులో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా.. సభకు ఆయన హాజరవుతున్నారు. దీనికోసం ఆయన 29వ తేదీన నెల్లూరు జిల్లాలో పర్యటన ముగించుకుని ఉదయం 11.15గంటలకు ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరం విమానా శ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన 11.25 గంటలకు బయలుదేరి కాతేరులోని మల్లు లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు వస్తారు. 11.45గంటల నుంచి ఒంటి గంట వరకూ బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం 1.50 గంటలకు బయలుదేరి కాతేరులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 2గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని వడ్లమూడి గ్రామం వెళతారు.

ఆధునిక సాంకేతికతతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

- ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్ కుమార్ మిశ్రా
- అత్యాశతో చిక్కుల్లో పడొద్దు : సీఐడీ అడిషనల్ ఎస్పీ పాపారావు



సదస్సులో మాట్లాడుతున్న సీఐడీ అడిషనల్ ఎస్పీ పాపారావు

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటే సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడుతుందని ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. ఐజీఎస్‌సీఎస్ సౌజన్యంతో రాజమహేంద్రవరం ప్రాం తీయ సీఐడీ అధికారి ఆధ్వర్యంలో సైబర్ నేరాల తీరు, వాటిని అరికట్టే విధానాలపై పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు.సైబర్ నేరాలపై రూపొందించిన బ్రోచర్‌ని ఆవిష్కరించి మాట్లాడారు. అంతగా చదువుకోని వాళ్లు ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడుతుంటే బాగా చదువుకున్న వారు సైతం వాటిని ఎదుర్కోవడంలో విఫలం కావడం ఆవేదన కలిగి స్తోందన్నారు. ఇటీవల నమోదవుతున్న కేసుల్లో ఎక్కువగా అలాంటివే ఉంటున్నాయన్నారు. దీనికి సాంకేతికతపై అవగాహన లేక పోవడమే అసలు కారణమన్నారు. సాంకేతిక పరికరాలను వినియో గించే క్రమంలో ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోసం జరిగిందని గ్రహించిన వెంటనే టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి గానీ, సైబర్ క్రైం పోలీసులకు గానీ ఫిర్యాదు చేయాలన్నారు. సీఐడీ అదనపు ఎస్పీ పాపారావు మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే అనవసర మైన లింకులను అత్యాశతో క్లిక్ చేస్తూ చిక్కులో పడుతున్నారని తెలిపారు. మోసం చేయడానికి సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో ఆశ కల్పిస్తుంటారని గ్రహించాలన్నారు. బ్యాంక్ అకౌంట్, వ్యక్తిగత, ఆధార్, పాన్, ఏటీఎం నెంబర్, పిన్, ఓటీపీ వివరాలను అపరిచితులతో పంచుకోకూడదన్నారు. హైదరాబా ద్‌లోని ఇన్‌ఫర్మేషన్ అండ్ సైబర్ సెక్యూరిటీ రీసెర్చ్ మాజీ సీఐఎస్‌వో టీ.శ్రీనివాస్ ఇంటర్నెట్, సెల్‌ఫోన్ల వినియోగంలో కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఓటీపీలు చెప్పమనడం, మోసపూరిత లింకులు, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్లు ఇబ్బందులకు గురిచేస్తాయన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం ఉంచకపోవడమే మేలన్నారు. టోల్‌ఫ్రీ నెం.1930 ఆవశ్యకత గురించి సీఐడీ హెడ్ క్వార్టర్స్ అడిషనల్ ఎస్పీ సీహెచ్ సురేశ్ వివరించారు. ఉదయం సెషన్‌లో ఉమ్మడి గోదావరి జిల్లాల పోలీసు సిబ్బంది, జీఎంఎస్‌కే, మధ్యాహ్నం సెషన్‌లో కాలేజీ విద్యార్థులు, బ్యాంకు సిబ్బంది, నెట్‌వర్క్ ప్రొవైడర్లు హాజరయ్యారు. వారికి సైబర్ క్రైంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విశదీకరించడంతోపాటు సంబంధిత మెటీరియల్‌ని అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు బి.రామకృష్ణ, సీహెచ్ పెంటారావు, ఇన్ స్పెక్టర్లు జీవీవీ సత్యనారాయణ, ఎం.బాలకృష్ణ, ఐ.గోపాలకృష్ణ, డి.వి జయ్‌కుమార్, పీవీవీ నరసింహరావు, ఎం.శేషు, వి.శ్రీనివాస్, సీహెచ్ వెంకటేశ్వరరావు, జి.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు షిరిడిసాయి ఆలయంలో లక్ష పుష్పార్చన

నిడదవోలు, జనవరి 27: నిడదవోలులోని చిన కాశీరేవులో షిరిడి సాయి మందిరంలో ఈ నెల 28న వార్షిక లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రధానార్చకుడు శ్రీకంఠం సురేష్‌శర్మ తెలిపారు. ఉదయం 5గంటల నుంచి సాయంకాలం వరకు పూజా కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు.

సుస్థిర పాలన అందించడమే లక్ష్యం



సుబ్రహ్మణ్యంకు నియామక పత్రం అందిస్తున్న గెల్లా శ్రీనుబాబు

గోపాలపురం, జనవరి 27: దేశప్రజలకు సుస్థిరమైన పాలన అందించడమే భారతీయ జనతాపార్టీ లక్ష్యమని మండలాధ్యక్షుడు గెల్లా శ్రీనుబాబు అన్నారు. మండలంలోని వాదాలకుంట గ్రామానికి చెందిన దేవిన శ్రీనివాసరావు కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడిగా, కరగపాడు, బుచ్చయ్యపాలెం గ్రామానికి చెందిన ఆకుల సుబ్రహ్మణ్యం కిసాన్ మోర్చ జిల్లా కన్వీనర్‌గా నియామకపత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యంలు మాట్లాడుతూ అధిష్ఠానం తమకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిసామ్తని, బీజేపీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామన్నారు. ఉండవల్లి మార్కండేయులు, దేవులపల్లి నరేంద్ర, కొండెపాటి రత్నాజీ చౌదరి, కే.సువర్ణరాజు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్ఈబీ దాడుల్లో నలుగురి అరెస్టు

దేవరపల్లి, జనవరి 27: దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో దాడులు నిర్వహించి 69 మద్యం సీసాలు, 26 బీర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని, ఒక మహిళ సహా నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ కేవీ స్వామి తెలిపారు. గోపాలపురం మండలం చిట్యాలలో కామంచి సురేష్‌ను అరెస్టు చేసి 46 మద్యం సీసాలు, గోపాలపురానికి చెందిన ఏ.శివగంగాధర్‌ను అరెస్టు చేసి 17, దేవరపల్లి మండలం దుద్దుకూరుకు చెందిన ఒరిగేటి అంజలిదేవిని అరెస్టు చేసి 4 మద్యం సీసాలు, 13 బీర్ బాటిల్స్, అదే గ్రామానికి చెందిన వెలగన పుల్లారావును అరెస్టు చేసి 2 మద్యంసీసాలు, 13 బీరు బాటిల్స్ స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ కె.సూర్యుడు, సిబ్బంది పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



చాంపియన్‌షిప్ సాధించిన రామన్నపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు

దేవరపల్లి, జనవరి 27: రిపబ్లిక్ డే సందర్భంగా రాజమహేంద్రవరంలో ఎస్‌వీటీ కళాశాలలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ పోటీల్లో దేవరపల్లి మండలం రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు బాలురు, బాలికల విభాగంలో ఛాంపియన్‌షిప్ సాధించి కప్పులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా శని వారం క్రీడాకారులను హైస్కూల్లో పీడీ పేరం రవీంద్రనాథ్, పీఈటీ సరస్వతితో పాటు సర్పంచ్ కూచిపూడి బుల్లారావు, ఉపాధ్యాయులు, అభినందించారు.

గవర్నర్ తమిళ్‌సైకు డాక్టర్ రామారెడ్డి శుభాకాంక్షలు



గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రాజభవన్‌లో జరిగిన ఎట్ హోం ఫంక్షన్లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళసై సౌందరరాజన్‌కు డాక్టర్ దశరథ రామారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు టీడీపీ సమావేశం

నల్లజర్ల, జనవరి 27: మండలంలోని అనంతపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించనున్న టీడీపీ సమావేశానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు పిలుపునిచ్చారు. రా కదలిరా సమావేశానికి సన్నాహలపై సమీక్ష, బీసీ జయహో సదస్సు, ఇంటిగ్రేటెడ్ శిక్షణ జరుగుతుందన్నారు.

విక్టర్‌బాబుకు ఉత్తమ హౌసింగ్ ఏఈ అవార్డు



అవార్డులు అందుకుంటున్న విక్టర్‌బాబు, వెంకట్రావు

ఉండ్రాజవరం, జనవరి 27: ఉండ్రాజవరం మండల హౌసింగ్ ఏఈ ఎం.విక్టర్‌బాబుకు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు పొందడం పట్ల మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పలువురు శనివారం అభినందించారు. విక్టర్‌బాబుకు 2023-2024లో ఉత్తమ సేవలు అందించించినందుకుగాను శుక్రవారం రిపబ్లిక్ డే సందర్భంగా విజయవాడలో హౌసింగ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అలాగే మండలంలో పనిచేస్తున్న హౌసింగ్‌బోర్డు వర్క్స్ ఇనస్పెక్టర్ టి.వెంకట్రావు జిల్లా స్థాయి ఉత్తమ సేవల అవార్డు కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా అందుకున్నారు. వెంకట్రావును కూడా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

'ఆంధ్రజ్యోతి'ని సందర్శించిన శ్రీప్రకాష్ విద్యార్థులు



ఆంధ్రజ్యోతి దినపత్రిక కార్యాలయంలో శ్రీప్రకాష్ స్కూల్ విద్యార్థులు

దివాన్‌చెరువు, జనవరి 27: దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ స్కూల్ విద్యార్థులు నాలెడ్జ్ ట్రిప్‌లో బాగంగా శనివారం ఉదయం సుమారు వంద మంది విద్యార్థులు పాలచర్ల గ్రామంలోని ఆంధ్రజ్యోతి దినపత్రిక కార్యాలయాన్ని సందర్శించారు. వారికి ఆంధ్రజ్యోతి సిబ్బంది పత్రిక తయారయ్యే విధానం, ప్రాసెస్, ప్రింటింగ్ వివరించి చూపించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పలువురు ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో స్టెమీ ప్రోగ్రాం విజయవంతం

పైలెట్ ప్రోగ్రాంగా అనపర్తి ఏరియా ఆసుపత్రి

అనపర్తి, జనవరి 27: తీవ్రమైన గుండె నొప్పితో బాధపడే రోగికి అత్యవసరంగా ఉపయోగించే స్టెమీ ప్రోగ్రాంను అనపర్తి ఏరియా ఆసుపత్రిలో వైద్యులు దిగ్విజయంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా వైద్యులను ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడి సత్కరించారు. స్టెమీ ప్రోగ్రాం గురించి ఆయన మాట్లాడుతూ తీవ్ర గుండె నొప్పితో బాధపడే రోగిని అర గంట లోపున ఆసుపత్రికి తీసుకురాగలిగితే త్రుంబోలిసిస్ అనే ప్రక్రియ ద్వారా ప్రాణాలు కాపాడవచ్చన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ఈ కార్యక్రమం నిర్వహించేందుకు అనపర్తి ఏరియా ఆసుపత్రిని ఎంపిక చేశారని చెప్పారు. తీవ్ర గుండె నొప్పి, శ్వాసకోశ ఇబ్బందితో వచ్చిన రాజు(47) రోగికి రూ.40 వేలు విలువైన టెనెక్ట్ ప్లేస్ అనే ఇంజక్షన్ అందించడం ద్వారా అతని ప్రాణాలు కాపాడగలిగామన్నారు. ఈ ప్రక్రియ నిర్వహించిన వైద్యులు చంద్రశేఖర్, డాక్టర్ దేవిడ్‌రతన్, డాక్టర్ వాసవిలను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రక్రియ నిర్వహించిన వైద్యులను పలువురు అభినందించారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజీమాల్ వై.స్ర్కీన్ 1	గుంటూరుకారం
వై.స్ర్కీన్2	సైంధవ్
దేవిశ్రీ(గాయత్రి)	నా సామి రంగ
అనన్య	గుంటూరు కారం

నిడదవోలు

వీ మ్యాక్స్	గుంటూరు కారం
రాధాకృష్ణ	హనుమాన్
శ్రీగణపతి	సైంధవ్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్